https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక

సంపుటి 13 | సంచిక 182 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల రూ. 5.00 | పేజీలు 14

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra Pradesh & Telangana | సోమవారం, మార్చి 09, 2026

## బెంగాల్ యువతకు
# దీదీ బంపర్ ఆఫర్



**10వ తరగతి పాస్ అయితే చాలు..**

**నెలకు రూ.1,500 భృతి!**

**పశ్చిమ బెంగాల్‌లో 'యువశక్తి' పథకాన్ని ప్రకటించిన మమతా బెనర్జీ**

**2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా టీఎంసీ వ్యూహం**

02

## వరల్డ్ ఛాంపియన్
# భారత్

**టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర..**

**న్యూజిలాండ్‌పై అల్టిమేట్ విక్టరీ**

**2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్**

**పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు**

**ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం**

**బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన**

**అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్**




-వివరాలు స్పోర్ట్స్ పేజీలో...



## మహిళాభివృద్ధి కోసం
# 'స్వయం' బ్రాండ్

**నేనే అంబాసిడర్‌గా ఉంటా: సీఎం చంద్రబాబు**

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలో కార్యక్రమం**

**ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు**

**ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి**

**మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన**

**డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ**

**అమరావతి, మార్చి08 (ప్రజా ప్రతిభ):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకు రావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు మిగతా 2లో..



## భారత్, చైనా ఒకరికొకరు ముప్పు అని భావించుకోవద్దు..

**ప్రత్యర్థుల్లా చూసుకోవద్దు: చైనా విదేశాంగ మంత్రి**

**రెండు దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని సూచన**

**అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలు మెరుగుపరుచుకోవాలని వ్యాఖ్య**

**మోదీ, జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందన్న వాంగ్ యీ**

02



## చంద్రబాబు సమక్షంలో
# సెర్ఫ్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

**వేర్వేరు సంస్థలతో మెప్మా, సెర్ప్ ఒప్పందాలు**

**నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం**

**చంద్రబాబు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు**




**అమరావతి, మార్చి08 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వేర్వేరు సంస్థలతో పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సముద్రపు నాచుతో ఉత్పత్తుల తయారీకి 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా వివిధ సంస్థలతో మిగతా 2లో..

## నారీశక్తి వట్టిమాటే...
# మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను మోసం చేశాయన్న షర్మిల**

**సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు నయవంచనకు పాల్పడ్డారని ఆరోపణ**

**మహాశక్తి, తల్లికి వందనం పథకాలతో లక్షల మందికి అన్యాయం జరిగిందని విమర్శ**

**దేశంలో మహిళలకు భద్రత కరువైందంటూ కేంద్ర ప్రభుత్వంపై ఫైర్**

**గ్యాస్, విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజం**

**అమరావతి, మార్చి08 (ప్రజా ప్రతిభ):** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన మిగతా 2లో..



## గల్ఫ్ దేశాలపై ఇరాన్
# భీకర దాడులు...


**కువైట్, సౌదీలలో ఉద్రిక్తత**

**కువైట్ ఎయిర్‌పోర్ట్ ఇంధన ట్యాంకులే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడులు**

**యూఏఈ గగనతలంలో కూల్చివేతలు.. దుబాయ్ విమానాశ్రయం కాసేపు మూసివేత**

**దాడులు ఆపేది లేదని స్పష్టం చేసిన ఇరాన్ జ్యుడీషియరీ చీఫ్**

02



## ఆకాశంలో సగం కాదు...
# నింగీ నేలా మీరే

**మహిళలకు నారా లోకేశ్ శుభాకాంక్షలు**

**మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్**

**ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి**

**పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం**

**ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే**

**సినిమాల్లో మహిళలను కించపరిచేలా ఉంటే ఊరుకోనని హెచ్చరిక**

**అమరావతి, మార్చి08 (ప్రజా ప్రతిభ):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనియాడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. "అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగీ నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది" అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా మిగతా 2లో..





## జేడీయూలో అధికారికంగా చేరిన
# నితీశ్ కుమార్ తనయుడు

**పాట్నాలోని పార్టీ కార్యాలయంలో నిశాంత్ కుమార్‌ను ఘనంగా ఆహ్వానించిన సీనియర్ నేతలు**

**తండ్రి మార్గదర్శకత్వంలోనే బీహార్ అభివృద్ధికి పనిచేస్తానని నిశాంత్ వెల్లడి**

**త్వరలో చంపారన్ నుంచి రాజకీయ పర్యటనలు ప్రారంభించే అవకాశం**

**పాట్నా, మార్చి08 (ప్రజా ప్రతిభ):** బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం మిగతా 2లో..

## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని
# ఈ సంఘటన కలిచివేసింది

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న మాధవ్**

**సంతాల్ కాన్ఫరెన్స్‌లో సరైన ప్రోటోకాల్ పాటించలేదని ఆవేదన**

**రాజ్యాంగ పదవిని గౌరవించలేదంటూ టీఎంసీపై మండిపాటు**

**గిరిజన బిడ్డను అవమానించడం దేశానికే అవమానమని వ్యాఖ్య**

**పశ్చిమ బెంగాల్‌లో అరాచక పాలన సాగుతోందని ఆగ్రహం**



**అమరావతి, మార్చి08 (ప్రజా ప్రతిభ):** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని మిగతా 2లో..

https://prajaprathibha.com
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక



# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు.

"మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు.

ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.



ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు.

తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు.

## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది



(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు.

సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు.

దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్



(మొదటిపేజీ తరువాయి)

పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.

## చంద్రబాబు సమక్షంలో సెర్ప్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

(మొదటిపేజీ తరువాయి)

సెర్ప్, మెప్మా ఒప్పందాలు చేసుకున్నాయి. చంద్రబాబునాయుడు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు చేసుకున్నాయి.

**కుదిరిన ఒప్పందాలు ఇవీ**

– పట్టణ ప్రాంతాల్లో 260 ఎగ్ కార్ట్స్ సహా మహిళలతో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు కోసం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీతో ఒప్పందం చేసుకున్న మెప్మా.

– ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు తీసుకునే రుణాలపై డేటా డ్రివెన్ క్రెడిట్ అసెస్మెంట్ మోడల్స్ తయారీ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఒప్పందం.

– మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్, ఆధునిక రీటైల్ కియోస్క్‌ల ఏర్పాటు కోసం రీకనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.

– మహిళా మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లకు ఆహారపదార్థాల కోసం యంత్రపరికరాలను అందించేందుకు కూలెక్స్ ఇండస్ట్రీస్‌తో ఒప్పందం.

– స్వయం ఏపీ ఎంటర్‌ప్రైజ్ ఏర్పాటు, మార్కెటింగ్ లింకేజ్ కోసం నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో కుదిరిన ఒప్పందం.

– అరకు కాఫీ, చాయ్ రాస్తా లాంటి అవుట్ లెట్స్ ఏర్పాటు కోసం ఎస్‌హెచ్ జీ మహిళలకు ఆర్థిక సహకారం కోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం.

– ఎస్‌హెచ్ జీ మహిళల కుటుంబాల ఇళ్లనిర్మాణానికి ఆర్థిక సహకారం అందించేలా ఈజీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.

– తిరుపతి క్యాంటీన్ల నిర్వహణ కోసం స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆర్థిక సహకారం అందించేలా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుతో ఒప్పందం.

– మిల్లెట్లతో తయారైన పదార్థాల రీటైల్ అవుట్ లెట్‌ల ఏర్పాటు కోసం 9 నట్జ్ మిల్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.

– మహిళా సంఘాలు ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసుకునేలా డిజిటల్ డీపీఆర్‌లు సిద్ధం చేసుకునేలా సహకారం కోసం ఫిన్ వోయిస్ ఓపెన్ బిజినెస్ సొల్యూషన్స్‌తో ఒప్పందం.

– సౌందర్య ఉత్పత్తుల్లో వినియోగించే సముద్రపు నాచు సాగులో స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం.

– సీవీడ్ కల్చర్‌లో మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల తయారీ కోసం సీఎస్ఐఆర్‌తోనూ కీలకమైన ఒప్పందం చేసుకున్న సెర్ప్.

– ఎస్‌హెచ్‌జీ మహిళలకు సీవీడ్ ఉత్పత్తులు, విలువ జోడింపు, శిక్షణ కోసం కేరళకు చెందిన అమృత విశ్వ విద్యాపీఠంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.

– వెలుగు 2.0 ద్వారా ఎస్‌హెచ్‌జీ పారిశ్రామిక వేత్తలను బలోపేతం చేసేలా శిక్షణ, ప్రొఫైలింగ్, మార్కెట్ స్కేల్ అప్ కోసం ఎక్స్‌ఎల్ఆర్ఐ సంస్థతో ఒప్పందం.

– పొదుపు చేసిన మొత్తాలను వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన సహకారం కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో సెర్ప్ ఒప్పందం.

– సర్క్యులర్ ఎకానమీ మోడల్ ద్వారా చేనేత వస్త్రాల జాబ్ వర్క్‌ను విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాల్లో ఆప్కో మాజిక్ వీవ్స్‌తో ఒప్పందం.

– మహిళా ఎఫ్‌పీఓల బలోపేతం, మార్కెట్ లింకేజి, సహా వివిధ అంశాలపై సహకారం కోసం ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.

– దేశీయ పౌల్ట్రీ ఉత్పత్తులు, ప్రకృతి సేద్యం ల్యాండ్ స్కేప్ లాంటి అంశాల్లో సహకారం కోసం వాసన్‌తో ఒప్పందం.

– లైవ్ స్టాక్ వ్యాల్యూ చైన్స్, ఎఫ్‌పీఓలకు సాంకేతిక మద్దతు అందించేందుకు హైఫెర్ ఇంటర్నేషనల్‌తో కుదిరిన ఒప్పందం.

– ఎఫ్‌పీఓ సర్టిఫికేషన్, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించే అంశాలకు మద్దతు ఇచ్చేలా విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం.

– మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సహా , క్రెడిట్ రెడీనెస్ కోసం కాల్గుడి డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.

– మహిళా ఎఫ్‌పీఓలకు ప్రోత్సాహం, ఉత్తరాంధ్రలోని గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం బాపూజీ రూరల్ ఎన్‌లైట్మెంట్ డెవలప్మెంట్ సొసైటీతో ఒప్పందం.

– మిల్లెట్ క్లస్టర్ల అభివృద్ధి, బ్రాండింగ్ లాంటి అంశాల్లో యాక్సెస్ లైవ్లీ హుడ్స్ కన్సల్టింగ్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న సెర్ప్.

– ఎస్‌హెచ్‌జీ సంస్థలు ఉత్పత్తి చేసిన సుగంధ ద్రవ్యాలు, పచ్చళ్ల తయారీ ఇతర ప్రాసెసింగ్ కోసం నిఎంఎస్ఎంఈతో ఒప్పందం.

## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే

(మొదటిపేజీ తరువాయి)

వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు.

ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి', 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు. సమాజంలో తరచూ వినిపించే "ఆడపిల్లలా ఏడవొద్దు", "గాజులు తొడుక్కోలేదు", "చీర గాజులు పంపిస్తా" వంటి మాటలు ఎవరు మాట్లాడినా తప్పేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మహిళలను కించపరిచే భాష, సన్నివేశాలు ఉండకూడదని తాను పోరాడుతున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామూర్తుల సహనానికి, శక్తికి లోకేశ్ పాదాభివందనం చేశారు.

## జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

(మొదటిపేజీ తరువాయి)



పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు.

పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా.. నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు.

ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు.

కాగా, నిశాంత్ కుమార్ త్వరలోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని జేడీయూ ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ తెలిపారు. చంపారన్ ప్రాంతం నుంచి ఆయన తన రాజకీయ యాత్రను ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. గతంలో నితీశ్ కుమార్ కూడా తన రాజకీయ యాత్రలను అక్కడి నుంచే మొదలుపెట్టేవారు. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో నిశాంత్ కీలక పాత్ర పోషిస్తారని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తారని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి.

## బెంగాల్ యువతకు దీదీ బంపర్ ఆఫర్

**10వ తరగతి పాస్ అయితే చాలు..**

**నెలకు రూ.1,500 భృతి!**

**పశ్చిమ బెంగాల్‌లో 'యువశక్తి' పథకాన్ని ప్రకటించిన మమతా బెనర్జీ**

**2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా టీఎంసీ వ్యూహం**

**ఓట్ల కోసమే ఈ పథకమంటూ ప్రతిపక్ష బీజేపీ విమర్శలు**

**పశ్చిమ బెంగాల్, మార్చి08 (ప్రజా ప్రతిభ):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓ కీలకమైన ఎన్నికల హామీని ప్రకటించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఆకట్టుకునే లక్ష్యంతో 'యువశక్తి' అనే కొత్త పథకాన్ని ఆమె తెరపైకి తెచ్చారు. ఈ పథకం కింద అర్హులైన యువతీ యువకులకు నెలకు రూ.1,500 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని తెలిపారు.

2026 ఎన్నికల్లో గెలిచి, వరుసగా మూడోసారి (హ్యాట్రిక్) అధికారాన్ని నిలబెట్టుకోవాలని మమతా బెనర్జీ పట్టుదలతో ఉన్నారు. ఇందులో భాగంగానే పదో తరగతి ఉత్తీర్ణులై, ప్రస్తుతం ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్న యువతకు ఈ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఈ మొత్తాన్ని జమ చేయనున్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ప్రయోజనం చేకూర్చనుందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం భావిస్తోంది.

ప్రతిపక్షాల విమర్శలు

ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న టీఎంసీ, ఇప్పుడు నేరుగా నగదు బదిలీ పథకాన్ని ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం అమలుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే, మమత ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా విమర్శిస్తోంది. కేవలం ఓట్ల కోసమే టీఎంసీ ఇలాంటి తాయిలాలు ప్రకటిస్తోందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మరింత భారం మోపుతుందని ఆరోపించింది.

## భారత్, చైనా ఒకరికొకరు ముప్పు అని భావించుకోవద్దు.. ప్రత్యర్థుల్లా చూసుకోవద్దు

**చైనా విదేశాంగ మంత్రి**

**రెండు దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలనీ సూచన**

**అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలు మెరుగుపరుచుకోవాలని వ్యాఖ్య**

**మోదీ, జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందన్న వాంగ్ యీ**

**చైనా, మార్చి08 (ప్రజా ప్రతిభ):** భారత్, చైనా దేశాలు ఒకరికొకరు ముప్పు అని భావించకుండా అభివృద్ధికి తోడ్పడే అవకాశంగా చూడాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ అన్నారు. ఈ రెండు దేశాలు పరస్పరం ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాములుగా ఉండాలని అన్నారు. వార్షిక మీడియా సమావేశంలో సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోకుండా సంబంధాలను మెరుగుపరుచుకునే అంశంలో ఇరుదేశాలు కట్టుబడి ఉండాలని అన్నారు.

పొరుగు దేశాలుగా, గ్లోబల్ సౌత్ సభ్యులుగా భారత్, చైనా దీర్ఘకాలిక సంబంధాలను కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం అనేవి రెండు దేశాల అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. విభజనవాదం, ఘర్షణలు అభివృద్ధిని దెబ్బతీస్తాయని సూచించారు. రెండేళ్ల క్రితం కజాన్ వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల సమావేశం అనంతరం భారత్, చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. గత ఏడాది తియాంజిన్‌లో మోదీ, జిన్‌పింగ్ మరోసారి భేటీ అయ్యారని, ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరిచాయని అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకోవడం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడటం వంటివి ఇరుదేశాలకూ ప్రయోజనం చేకూర్చాయని అన్నారు. ఇరు దేశాలు సత్సంబంధాలు, స్నేహాన్ని కాపాడుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం కొనసాగాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.

## గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు... కువైట్, సౌదీలలో ఉద్రిక్తత


**కువైట్ ఎయిర్‌పోర్ట్ ఇంధన ట్యాంకులే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడులు**

**సౌదీలోని రియాద్, ఎయిర్ బేస్‌లపైకి దూసుకొచ్చిన క్షిపణులు**

**యుద్ధం మొదలైనప్పటి నుంచి 1300కు పైగా డ్రోన్లను ప్రయోగించిన ఇరాన్**

**యూఏఈ గగనతలంలో కూల్చివేతలు.. దుబాయ్ విమానాశ్రయం కాసేపు మూసివేత**

**దాడులు ఆపేది లేదని స్పష్టం చేసిన ఇరాన్ జ్యుడీషియరీ చీఫ్**



**ఇరాన్, మార్చి08 (ప్రజా ప్రతిభ):** గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారంతో ఈ ప్రాంతీయ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మరోసారి క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి.


కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఇంధన ట్యాంకులే లక్ష్యంగా శత్రు డ్రోన్లు చొరబడ్డాయని ఆ దేశ సైన్యం వెల్లడించింది. వీటిని అడ్డుకునే క్రమంలో పడిన శకలాల వల్ల కొన్ని పౌర నివాసాలకు నష్టం వాటిల్లింది. ముందుజాగ్రత్త చర్యగా కువైట్ నేషనల్ ఆయిల్ కంపెనీ ముడి చమురు ఉత్పత్తిని తగ్గించింది. ఇక సౌదీ అరేబియాలో రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాలయాలు, అమెరికా బలగాలున్న 'ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్' లక్ష్యంగా వచ్చిన 15 డ్రోన్లు, 3 బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఖతార్‌పై ప్రయోగించిన 12 క్షిపణులను కూడా విజయవంతంగా అడ్డుకున్నారు.

శనివారం దుబాయ్ విమానాశ్రయం పరిసరాల్లో గుర్తుతెలియని వస్తువును కూల్చివేయడంతో, విమానాశ్రయాన్ని కాసేపు మూసివేశారు. ఆకాశంలో జరిగిన ఈ ఇంటర్‌సెప్షన్ వల్ల రాలిన శకలాలు తగిలి ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించాడు. ఈ పరిణామాలపై యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ స్పందిస్తూ.. "ప్రస్తుతం ఎమిరేట్స్ యుద్ధంలో ఉంది, దీని నుంచి మనం మరింత బలంగా బయటపడతాం" అని జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 221 బాలిస్టిక్ క్షిపణులు, 1300కు పైగా డ్రోన్లను గుర్తించినట్లు యూఏఈ రక్షణ శాఖ తెలిపింది.

ఇకపై దాడులు చేయబోమని ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఆ దేశ జ్యుడీషియరీ చీఫ్ మాత్రం శత్రువుల స్థావరాలపై దాడులు కొనసాగుతాయని హెచ్చరించడం గమనార్హం. గల్ఫ్ దేశాలకు అమెరికా మిత్రదేశం కావడం, అక్కడ అమెరికా సైనిక స్థావరాలు ఉండటంతో యూఏఈపై ఇరాన్ ఎక్కువగా గురిపెట్టినట్లు తెలుస్తోంది.

# జానపద వీరగాథ నుంచి చారిత్రక సాక్ష్యాలు

## దేశిరెడ్డి వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

ప్రకాశం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గంలోని బెస్తవారిపేటలో దేశిరెడ్డి కుటుంబంలో జరిగిన వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశిరెడ్డి రఘునాథరెడ్డి, విజయలక్ష్మీదేవి దంపతుల కుమారుడు శశిధర్ రెడ్డి వివాహం ప్రీతిరెడ్డితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు పరస్పర అవగాహనతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశిరెడ్డి కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ వివాహ వేడుక గ్రామంలో పండుగ వాతావరణాన్ని సృష్టించింది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు ప్రాంతీయ ప్రజలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ మహోత్సవం స్నేహసమ్మేళనంగా మారి ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

## అనిమిశెట్టి వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

ప్రకాశం జిల్లా,గిద్దలూరు నియోజకవర్గం బెస్తవారిపేట మండలం ఓందుట్ల గ్రామంలో అనిమిశెట్టి కుటుంబంలో జరిగిన వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. గ్రామానికి చెందిన కీ.శే. అనిమిశెట్టి వెంకట రమణ, శ్రీదేవి దంపతుల కుమారుడు సాయి కుమార్ వివాహం సౌమ్యతో ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ వివాహ వేడుకకు గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివాహ వేడుక ఏర్పాట్లను అభినందించారు. వివాహ మహోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలక...

## ఇంటూరి వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం పట్టణంలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్‌లో, ఇంటూరి కుటుంబ వివాహ మహోత్సవం సాంప్రదాయబద్ధంగా జరిగింది. ఇంటూరి శ్రీనివాసరెడ్డి, నారాయణమ్మ దంపతుల కుమారుడు పరమేశ్వరరెడ్డి వివాహం శ్వేతతో ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వివాహ మహోత్సవానికి గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ పెద్దలతో మాట్లాడి ఆనందాన్ని పంచుకున్నారు. వివాహ వేడుకలో ప్రాంతానికి చెందిన నాయకులు, మిత్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివాహ కార్యక్రమం సంప్రదాయ పద్ధతిలో జరిగింది. వేదికను పూలతో అలంకరించి, మంగళవాయిద్యాల నడుమ వధూవరుల పెళ్లి ఘనంగా నిర్వహించారు. అతిథుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భోజన విందు కూడా ఏర్పాటు చేశారు. వచ్చిన అతిథులందరిని కుటుంబ సభ్యులు ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

### కాటమరాజు కథా చక్రము, గుండంచర్ల యుద్ధ స్థలం చరిత్ర.







**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08,(ప్రజా ప్రతిభ ):**

మార్కాపురం జిల్లా, వేనూతల కాటమరాజు, వేనూతల గంగాభవాని క్షేత్రాల ఆలయ భాద్యులు పిన్నిక లక్ష్మి ప్రసాద్ యాదవ్ వివరంగా, ఆలయ చరిత్ర గురించి మాట్లాడుతూ, వేనూతల కాటమరాజు స్వామి చరిత్ర, అనేక తెలుగు జానపద సాహిత్యంలో వీరగాథలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తరతరాలుగా ప్రజల నోట ప్రయాణించిన ఈ గాథలు కేవలం కథలుగా మాత్రమే కాకుండా ఆ కాలపు సామాజిక పరిస్థితులు, రాజకీయ సంఘటనలు, ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే చారిత్రక ఆనవాళ్లుగా కూడా నిలుస్తున్నాయి. ప్రజల చరిత్రను ప్రజల భాషలోనే నిలిపిన సంపదగా జానపద గాథలను పండితులు పేర్కొంటారు. అలాంటి గాథలలో పల్నాటి వీరచరిత్రతో పాటు కాటమరాజు కథ తెలుగు సంప్రదాయంలో విశిష్ట స్థానం సంపాదించింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో యాదవ సమాజంలో కాటమరాజు కథ ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. పల్లెలలో జరిగే జాతరలు, గ్రామ దేవాలయాల ఉత్సవాలు, యాదవుల ఆచార వ్యవహారాల్లో ఈ కథలు తరచూ వినిపిస్తాయి. పెద్దల నుంచి చిన్నవారికి మౌఖికంగా సంక్రమిస్తూ వచ్చిన ఈ గాథలు జానపద గేయాల రూపంలో ప్రజల్లో విస్తరించాయి. ఈ కథల వెనుక బలమైన చారిత్రక నేపథ్యం ఉందని పండితులు, పరిశోధకులు పేర్కొంటున్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలోని రాజమలారణ్యంలో ఉన్న వేనూతల కాటమరాజు, వేనూతల గంగాభవాని క్షేత్రాలు ఈ సంప్రదాయానికి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఉగాది పండుగకు ముందు రోజు ఇక్కడ జరిగే జాతరకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి యాదవులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. తమ కులపురుషుడిగా భావించే కాటమరాజును స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా జానపద గాయకులు కాటమరాజు వీరగాథలను గానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రారంభంలో కాటమరాజు కథలను ఐతిహాస గాథలుగా మాత్రమే భావించిన అభిప్రాయాలు ఉన్నప్పటికీ తరువాత జరిగిన పరిశోధనలు ఈ కథల్లో చారిత్రక వాస్తవాలున్నాయని సూచించాయి. వేటూరి ప్రభాకరశాస్త్రి, తిమ్మావఝుల కోదండరామయ్య, బ్రౌన్, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి పండితులు ఈ గాథలపై పరిశోధనలు చేశారు. అయితే కాటమరాజు కథలను సమగ్రంగా సేకరించి శాస్త్రీయంగా విశ్లేషించిన పరిశోధకుడు తంగిరాల వెంకట సుబ్బారావు. ఆయన చేసిన పరిశోధన ప్రకారం కాటమరాజు కథలు మొత్తం ముప్పై రెండు ఉన్నాయి. వీటిని కాటమరాజు కథా చక్రము అని పేర్కొన్నారు. ఈ కథా చక్రములో పంతొమ్మిది ప్రధాన కథలు, ఆరు అనుబంధ కథలు ఉన్నాయి. మిగిలినవి ప్రాంతీయ రూపాంతరాలుగా గుర్తించబడ్డాయి. ఈ కథలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1976లో రెండు సంపుటాలుగా ప్రచురించింది. తరువాత 1998లో తెలుగు విశ్వవిద్యాలయం రెండవ ముద్రణ తీసుకొచ్చింది. తరువాత అందుబాటులో లేకపోవడంతో 2021లో మళ్లీ ఒకే సంపుటంగా ప్రచురించారు. కాటమరాజు కథలు ప్రధానంగా యాదవ రాజుల వీరగాథలు. వీటిని యాదవ భారతము, యదు శాస్త్రము అని కూడా పిలుస్తారు. పశువుల సంరక్షణ, ప్రజల రక్షణ, న్యాయం కోసం పోరాటం చేసిన యాదవుల త్యాగ చరిత్ర ఈ గాథల్లో ప్రతిఫలిస్తుంది. మహాభారతం, భాగవతంలో కనిపించే యాదవ వంశ గౌరవం ఈ కథల్లో ప్రతిధ్వనిస్తుంది. కాటమరాజు కథా చక్రములో ఖడ్గ తిక్కన ప్రస్తావన చారిత్రకంగా అత్యంత ప్రాధాన్యమైనది. ఖడ్గ తిక్కన ఒక చారిత్రక వ్యక్తిగా గుర్తించబడినట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. నెల్లూరు ప్రాంతాన్ని పాలించిన మనుమసిద్ధి కాలంలో నల్లసిద్ధి ఆస్థానంలో ఖడ్గ తిక్కన సేనాధిపతిగా పనిచేసినట్టు ఆధారాలు తెలియజేస్తున్నాయి. యాదవ రాజులతో జరిగిన యుద్ధంలో ఆయన వీరమరణం పొందినట్టు జానపద గాథలు వివరిస్తాయి. కాటమరాజు కథల గానంలో యుద్ధ ఘట్టాలు అత్యంత ఉద్ధృతంగా ఉంటాయి. సైన్యాల కదలికలు, గుర్రాల పరుగులు, కత్తుల ఢీకొనడం, వీరుల పోరాటం వంటి అంశాలను జానపద గాయకులు ఉత్కంఠభరితంగా వర్ణిస్తారు. ఇలాంటి వివరాలు ప్రత్యక్ష అనుభవం లేకుండా సాధ్యం కాదని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. కాటమరాజుల ఆస్థానాల్లో ఉన్న కవులు యుద్ధాలను ప్రత్యక్షంగా చూసి వర్ణించినందువల్లే ఈ కథల్లో నిజత్వం కనిపిస్తుందని భావిస్తున్నారు. తాళపత్ర గ్రంథాల ఆధారంగా తొమ్మిది మంది జానపద కవులు ఈ కథలను రచించినట్టు గుర్తించారు. గుంగుల పినయల్లయ, మద్దులేటి కవి, మల్లయ్య, కనకబండి ఘట్టయ్య, కట్టెబోయిన మారయ్య, గొట్టిపాటి మల్లయ్య, కదిరి మంగళం వెంకటాద్రి, రాలపాక వెంకురాం, జరుగుపల్లె చెన్నయ్య ఈ కవుల్లో ముఖ్యులు. వీరు ప్రాంతానుసారంగా కాటమరాజు కథలను గేయరూపంలో ప్రజల్లో విస్తరించారు. కాలనిర్ణయం విషయంలో కూడా ఈ కథలు స్పష్టతనిచ్చాయి. కాటమరాజు కథలలోని ప్రధాన వీరుల కాలం పన్నెండవ, పదమూడవ శతాబ్దాల మధ్యన ఉన్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆవుల వలురాజు, పెద్దిరాజు, పోలు రాజు, అయతమరాజు, కాటమరాజు, చోడ తిక్క, మనుమసిద్ధి, నల్లసిద్ధి వంటి పాలకుల కాలక్రమం ఈ గాథల్లో కనిపిస్తుంది. కాటమరాజు జననం క్రీశ 1217 ఫిబ్రవరి 19న జరిగినట్టు, వీరమరణం క్రీశ 1283 మార్చి 7న జరిగినట్టు పరిశోధనల్లో వెల్లడైంది. మధ్యయుగ కాలంలో కాటమరాజులు గుంటూరు, ప్రకాశం, నల్లగొండ, విశాఖపట్నం, తూర్పు గోదావరి ప్రాంతాల్లోని అనేక చిన్న రాజ్యాలను పాలించినట్టు ఆధారాలు సూచిస్తున్నాయి. అర్ధవీడు, దొనకొండ వంటి ప్రాంతాలు నేటికీ అదే పేర్లతో కొనసాగుతుండటం చారిత్రక ఆనవాళ్లుగా భావిస్తున్నారు. కనిగిరి కోట కూడా కాటమరాజు కాలానికి చెందినదనే విశ్వాసం ప్రజల్లో ఉంది. ఈ చారిత్రక నేపథ్యానికి కేంద్రబిందువుగా ప్రకాశం జిల్లా మార్కాపురం పరిధిలోని గుండంచర్ల, గండంచెర్ల ప్రాంతాలు నిలుస్తున్నాయి. కాటమరాజు కథల్లో అత్యంత కీలక ఘట్టమైన యుద్ధం ఈ ప్రాంతంలో జరిగినట్టు జానపద సంప్రదాయం చెబుతోంది. స్థానిక ప్రజల విశ్వాసం ప్రకారం గుండంచర్ల, గండంచెర్ల ప్రాంతాలు ఆ యుద్ధానికి సంబంధించిన ప్రధాన ప్రదేశాలుగా గుర్తించబడుతున్నాయి. కనిగిరి ప్రాంతంలోని పంచలింగాల కొండను పాలించిన కాటమరాజు పశువులకు మేత కొరత ఏర్పడటంతో తన మందలను నెల్లూరు ప్రాంతానికి తోలుకెళ్లినట్టు కథలు చెబుతున్నాయి. ఈ సమయంలో పుల్లరి పన్ను విషయంలో నెల్లూరు పాలకుడు మనుమసిద్ధితో వివాదం తలెత్తింది. ఆ వివాదం క్రమంగా ఘర్షణకు దారి తీసి చివరకు గండంచెర్ల ప్రాంతంలో ఘోర యుద్ధంగా మారినట్టు జానపద గాథలు వివరిస్తాయి. మార్కాపురం ప్రాంతం మీదుగా పెన్నానది తీరానికి చేరుకున్న కాటమరాజు సైన్యం మనుమసిద్ధి సేనతో ఎదురుపడినట్టు కథలు చెబుతాయి. ఈ యుద్ధంలో ఖడ్గ తిక్కన వంటి అనేక మంది వీరులు ప్రాణత్యాగం చేసినట్టు జానపద గేయాల్లో ప్రస్తావన ఉంది. చివరకు కాటమరాజు విజయం సాధించినప్పటికీ యుద్ధంలో అపారమైన ప్రాణనష్టం సంభవించినట్టు చెప్పబడుతుంది. యుద్ధంలో మరణించిన వీరులను స్మరించుకుంటూ ఎర్రగడపాడు ప్రాంతాన్ని పవిత్ర స్థలంగా భావిస్తున్నారు. గుండంచర్ల గ్రామ పరిసరాల్లో కూడా కొన్ని ప్రదేశాలను స్థానికులు యుద్ధంతో అనుసంధానంగా చెబుతుంటారు. కొన్ని గుట్టలను సైన్యం నిలిచిన ప్రదేశాలుగా, కొన్ని చెరువులను యోధులు నీరు తాగిన ప్రదేశాలుగా, కొన్ని మైదానాలను యుద్ధభూమిగా గుర్తిస్తారు. అధికారిక చరిత్రలో ఈ వివరాలు పూర్తిగా నమోదు కాలేకపోయినా ప్రజల విశ్వాసంలో ఇవి ముఖ్యమైన గుర్తులుగా నిలిచాయి. తెలుగు గ్రామీణ కళారూపాల్లో కూడా కాటమరాజు కథకు ప్రత్యేక స్థానం ఉంది. బుర్రకథలు, గొల్లసుద్దులు, జానపద గేయాల్లో ఈ కథను విస్తృతంగా వినిపిస్తారు. కాటమరాజు ధైర్యం, యుద్ధ ఘట్టాలు, ప్రజల కోసం చేసిన పోరాటం వంటి అంశాలు ఈ కళారూపాల్లో ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. ఈ కళారూపాలు చరిత్రను తరతరాలకు అందించే మాధ్యమాలుగా కూడా నిలిచాయి. ప్రతి సంవత్సరం జరిగే కాటమరాజు గంగ జాతర ఈ వీరగాథను సజీవంగా నిలుపుతోంది. గుండంచర్ల, గండంచెర్ల ప్రాంతాల్లో జరిగే జాతరలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. జానపద గానాలు, సంప్రదాయ పూజలు, సామూహిక ఆచారాలతో ఈ ప్రాంతం ఒక పెద్ద సాంస్కృతిక కేంద్రంగా మారుతుంది. యాదవ సమాజం తమ పూర్వీకుల వీరత్వాన్ని స్మరించుకుంటూ ఈ జాతరలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మొత్తంగా చూస్తే కాటమరాజు కథలు జానపద సాహిత్య పరిమితిని దాటి ఒక ప్రాంతీయ చరిత్రగా నిలిచాయి. యాదవ సమాజం జీవన విధానం, పశుపోషక సంస్కృతి, భూవనరులపై జరిగిన సంఘర్షణలు, రాజకీయ పోరాటాలు ఈ గాథల్లో ప్రతిబింబిస్తున్నాయి. ఇంకా లభ్యం కాని కథలను సేకరించి పరిశోధనలు కొనసాగించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. కాటమరాజు కథా చక్రము భవిష్యత్ తరాలకు చరిత్రను, వీరత్వాన్ని తెలియజేసే అమూల్య వారసత్వంగా నిలవనుంది.

## వెన్నపూస కుటుంబ వివాహ వేడుకలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

ప్రకాశం జిల్లాలోని దర్శి, పొదిలి రోడ్డులో ఉన్న కళ్యాణ మండపంలో నిర్వహించిన వెన్నపూస సుబ్బారెడ్డి కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వధూవరులతో కలిసి కుటుంబ సభ్యులను అభినందించారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఇరువురు కుటుంబాల పెద్దలు, బంధువులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు కూడా వివాహ వేడుకలో పాల్గొన్నారు. వెన్నపూస కుటుంబ సభ్యులు అతిథులను ఆతిథ్యంతో స్వాగతించి వివాహాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివాహ కార్యక్రమం సందర్భంగా ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమం సంతోషకర వాతావరణంలో జరిగింది.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 08 ( ప్రజా ప్రతిభ)**

మార్కాపురం జిల్లా లోని మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ,జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొని మహిళా సాధికారతపై ప్రసంగించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్, అంగన్‌వాడీ, పోలీస్ శాఖలకు చెందిన మహిళా సిబ్బంది ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి ఆరోగ్యం, పోషణ, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. మహిళలు పాల్గొన్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనగా, మహిళల ఉత్సాహభరిత వాతావరణం లో మహిళ దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

https://prajaprathibha.com RNI: APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts



# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

### - బహుజనుల ఆత్మగౌరవ పతాక ఝల్కారీబాయి
### - చరిత్ర మరచిన వీరనారి ఝల్కారీబాయి

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**





దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఎన్నో మహోన్నత త్యాగాలు, అసాధారణ వీరగాథలు దాగి ఉన్నాయి. ఆ పోరాటాల్లో పురుషులతో పాటు మహిళలు కూడా అపూర్వమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. అయితే చరిత్రలో కొంతమంది మహిళల పేర్లు వెలుగులోకి రాగా, మరికొంతమంది త్యాగవీరాంగనల కథలు మాత్రం కాలగర్భంలో మరుగున పడ్డాయి. అలాంటి వీరనారుల్లో ఒకరు ఝల్కారీబాయి. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె వీరోచిత జీవితాన్ని గుర్తు చేసుకోవడం సముచితం. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు భారత స్వాతంత్ర్య చరిత్రలో తొలి మహాసంగ్రామంగా గుర్తించబడింది. ఈ సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి నాయకత్వం భారతదేశానికి అపార స్ఫూర్తినిచ్చింది. బ్రిటిష్ పాలనకు తలవంచకుండా తన రాజ్యాన్ని రక్షించడానికి ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.
అయితే ఆ పోరాటంలో ఆమెకు నీడలా తోడుగా నిలిచిన ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర కూడా అంతే గొప్పది. ఉత్తర భారతదేశంలోని బుందేల్‌ఖండ్ ప్రాంతానికి చెందిన ఝల్కారీబాయి 1830 నవంబరు 22న ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో జన్మించింది. కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు పేద వ్యవసాయకూలీ కుటుంబంలో పుట్టింది. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో తండ్రి సంరక్షణలో పెరిగింది. చిన్న వయసులోనే గుర్రపు స్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలను నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతూ ఉండగా ఆమెపై దాడి చేసిన చిరుతపులిని కేవలం చేతికర్రతో ఎదుర్కొని సంహరించిన సంఘటన ఆమె ధైర్యానికి నిదర్శనంగా చెప్పబడుతుంది. తరువాత ఝాన్సీ సైన్యంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్‌ను వివాహం చేసుకుంది. ఆ పరిచయం ద్వారా ఆమె ఝాన్సీ రాణి లక్ష్మీబాయి దృష్టికి వచ్చింది. ఆమె ధైర్యసాహసాలను గమనించిన రాణి, మహిళా సైనిక దళంలో ఆమెను చేర్చింది. ఆ తర్వాత 'దుర్గావాహిని' అనే మహిళా సాయుధ దళంలో ప్రముఖ స్థానం పొందింది. కాలక్రమేణా ఆ దళానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగింది. 1857 తిరుగుబాటు సమయంలో బ్రిటిష్ సైన్యం ఝాన్సీ రాజ్యంపై దాడి చేసింది. బ్రిటిష్ సేనలు కోటను చుట్టుముట్టి తీవ్ర యుద్ధానికి దిగాయి. ఆ సమయంలో రాణి లక్ష్మీబాయి సురక్షితంగా బయటకు వెళ్లి ఇతర తిరుగుబాటు నాయకులతో కలవాల్సిన అవసరం ఏర్పడింది. అప్పుడు ఝల్కారీబాయి అపూర్వమైన ధైర్యంతో ముందుకు వచ్చింది. తానే రాణి లక్ష్మీబాయి వేషధారణలో కోట బయటకు వెళ్లి బ్రిటిష్ సేనలను గందరగోళానికి గురి చేసింది. దీంతో రాణి లక్ష్మీబాయి కోట నుండి బయటపడే అవకాశం లభించింది. బ్రిటిష్ సేనల ముందు తానే రాణి అని ప్రకటించి వారిని ఎదుర్కొన్న ఝల్కారీబాయి సాహసం ఆ కాలంలో పెద్ద సంచలనంగా మారింది. చివరకు ఆమె బ్రిటిష్ సైనికుల చేతికి చిక్కింది. అయితే ఆమె త్యాగం కారణంగా రాణి లక్ష్మీబాయి కొంతకాలం పాటు తిరుగుబాటును కొనసాగించగలిగింది. ఈ సంఘటన తర్వాత కూడా బుందేల్‌ఖండ్ ప్రాంత ప్రజల జానపద గీతాలలో ఝల్కారీబాయి పేరు తరతరాలుగా వినిపిస్తూ వచ్చింది. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి సరసన ఆమె ధైర్యసాహసాలను ప్రజలు పాటల రూపంలో స్మరించుకుంటున్నారు. కాలక్రమేణా ఆమె కథలు నాటకాలుగా, జానపద ప్రదర్శనలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారంలోకి వచ్చాయి. ఝల్కారీబాయి జీవితం దళిత బహుజన సమాజానికి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. ఆమె ధైర్యం, దేశభక్తి, త్యాగం కొత్త తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం కూడా ఆమెకు లభించిన గౌరవానికి నిదర్శనం. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను పరిశీలించినప్పుడు ఝాన్సీ రాణి లక్ష్మీబాయి పేరుతో పాటు ఝల్కారీబాయి పేరు కూడా సమానంగా నిలవాలి. చరిత్రలో మరుగున పడిన ఈ వీరనారి త్యాగాన్ని గుర్తు చేసుకోవడం సమాజం బాధ్యత. మహిళా దినోత్సవం సందర్భంగా ఝల్కారీబాయి వంటి వీరనారులను స్మరించుకోవడం ద్వారా మహిళల ధైర్యసాహసాలకు మనం నివాళి అర్పించినట్టవుతుంది.

## వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన కేపీ కొండారెడ్డి



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08 (ప్రజా ప్రతిభ):**
మార్కాపురం పట్టణంలోని సెవెన్ హిల్స్ కళ్యాణ మండపంలో, ఆదివారం నిర్వహించిన ఇంటూరీ మరియు గుంటక కుటుంబాల వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఇంటూరీ శ్రీనివాసరెడ్డి కుమారుడు, గుంటక శ్రీనివాసరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐడీసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ శాసనసభ్యుడు కె.పి. కొండారెడ్డి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమం ఆనందభరిత వాతావరణంలో సాగింది. వివాహ మండపం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అతిథులకు ఆతిథ్యం అందించి కుటుంబ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.

## పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడి.. ఐదుగురు అరెస్ట్



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08, (ప్రజా ప్రతిభ):**
మార్కాపురం జిల్లాలోని కంభం పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కంభం పట్టణంలోని ఒక రెసిడెన్సీ లాడ్జిలో కొంతమంది వ్యక్తులు గుప్తంగా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. సమాచారం ఆధారంగా కంభం మండల పోలీసు సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 6,060 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా కంభం మండల ఎస్సై శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ, నివాస సముదాయాలు, అపార్ట్మెంట్లు, లాడ్జిలలో నిబంధనలకు విరుద్ధంగా పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలపై పోలీసు శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పట్టణంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టగలమని పేర్కొన్నారు.

## పరిశుభ్రత కోసం శ్రమించే మహిళలకు ఘన సత్కారం

### మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరల పంపిణీ.



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08,(ప్రజా ప్రతిభ):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురం పట్టణంలో హృదయాన్ని హత్తుకునే సేవా కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న మహిళా శానిటరీ సిబ్బందికి చీరలు పంపిణీ చేసి ఘనంగా సత్కరించారు. సమాజ ఆరోగ్యానికి కీలకమైన పరిశుభ్రత బాధ్యతలను నిస్వార్థంగా నిర్వర్తిస్తున్న ఈ మహిళల సేవలను గుర్తించి వారికి గౌరవం తెలియజేయడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకువచ్చింది. ప్రతిరోజూ ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శ్రమిస్తూ రోగులు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది ఆరోగ్య భద్రతకు తోడ్పడుతున్న మహిళా శానిటరీ సిబ్బంది సేవలు సమాజానికి ఎంతో అవసరమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో వీరి కృషి గుర్తింపుకు నోచుకోకపోయినా, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ చైర్మన్ గుంటక వనజాక్షి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అపారమని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పరిశుభ్రతను కాపాడేందుకు అహర్నిశలు కష్టపడుతున్న మహిళా శానిటరీ సిబ్బంది సేవలు అమూల్యమని చెప్పారు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడే ఈ మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు అందజేసి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ సమాజంలో సేవాభావం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత కోసం నిస్వార్థంగా శ్రమించే మహిళలకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ బాధ్యులు టి. శ్రీనివాసరావు, ఆర్.కే.జి నర్సింహం, మహిళా సభ్యులు మల్లేశ్వరి, భూలక్ష్మి, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు కూడా హాజరై మహిళా శానిటరీ సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చీరలు అందుకున్న మహిళా శానిటరీ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తించి సత్కరించిన మానవతా సేవా సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తూ మరింత నిబద్ధతతో పనిచేస్తామని పేర్కొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మానవత్వం

### చాటుకున్న మున్సిపల్ ఉద్యోగి గుమ్మ ప్రసాద్ కుటుంబం.



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08 (ప్రజా ప్రతిభ):**
మార్కాపురం జిల్లా, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ప్రత్యేకంగా, మానవతా భావంతో జరుపుకుంటూ, మార్కాపురం పురపాలక సంఘ ఉద్యోగి గుమ్మ ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. సాధారణంగా ఇలాంటి వేడుకలు, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను ఆహ్వానించి విందులు ఏర్పాటు చేయడం ప్రస్తుత కాలంలో సాధారణంగా కనిపించే దృశ్యం. అయితే అందుకు భిన్నంగా సమాజానికి ఉపయోగపడే విధంగా ఒక మంచి ఆలోచనతో ఈ వేడుకను జరుపుకోవడం అందరి ప్రశంసలను అందుకుంటోంది. మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో నిర్వహిస్తున్న స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక వికలాంగుల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుమ్మ ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వేళ కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు అల్పాహార విందు ఏర్పాటు చేయడంతో పాటు పండ్లను పంపిణీ చేశారు. కేంద్రంలోని ప్రతి ఒక్కరికీ స్వయంగా దగ్గరుండి అల్పాహారం, పండ్లు అందజేయడం ద్వారా వారు చూపిన సేవాభావం అక్కడి వాతావరణాన్ని మరింత హృద్యంగా మార్చింది. సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగా ఉందని చాటిచెప్పే విధంగా జరిగిన ఈ కార్యక్రమం పట్టణ ప్రజలలో మంచి స్పందనను రేపింది. మానసిక వికలాంగుల పట్ల ప్రేమతో, కరుణతో వ్యవహరించడం ద్వారా సమాజంలో వారికి కూడా సమాన స్థానం ఉందనే భావనను బలపరిచే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని పలువురు అభివర్ణించారు. ఈ సందర్భంగా గుమ్మ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అనేక మంది పుట్టినరోజులు, పెళ్లిరోజులు, స్మారక దినోత్సవాలు వంటి సందర్భాల్లో అనవసరంగా అధిక వ్యయం చేస్తారని పేర్కొన్నారు. అలాంటి వేడుకలకు ఖర్చు చేసే డబ్బులో కొంత భాగాన్ని అయినా వికలాంగులు, నిరుపేదలు, ఆశ్రయం లేని వారికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది చేపడితే సమాజంలో మానవత్వం మరింత బలపడుతుందని సూచించారు. గుమ్మ ప్రసాద్ కుటుంబం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని పురపాలక సంఘ సిబ్బంది, పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందించారు. సమాజంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు పెరిగితే అవసరమైన వారికి సహాయం అందుతుందని, ఇతరులకు కూడా ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. జవహర్ నగర్ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి కొత్త అర్థం తీసుకొచ్చారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో సేవా భావం పెంపొందించాల్సిన అవసరం ఉన్న ఈ కాలంలో గుమ్మ ప్రసాద్ కుటుంబం చూపిన మార్గం అనుసరించదగ్గదని పలువురు అన్నారు.

## ఘనంగా మహిళ దినోత్సవం



**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 08 (ప్రజా ప్రతిభ)**
పొదిలి పట్టణంలోని సాయి బాలాజీ కళ్యాణమండపం నందు గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ సకల దేవతలు నివాసం ఉంటారు. ఈ సృష్టికి మూలం అమ్మ,అమ్మ లేకుంటే సృష్టే లేదు. అమ్మ కాదంటే మనకు జన్మేలేదు. అమృతానికి అర్పణం అసలు పేరు అమ్మ. అనుభూతికి ఆనవాళ్లు అమ్మ అని కొనియాడారు. ఈ సందర్భంగా సబాధ్యక్షులు హారిక, యూత్ కన్వీనర్ అనూష మాట్లాడుతూ పెద్ద ఎత్తున హాజరైన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. తదుపరి చాకిరాల తేజశ్రీని బూదాటి సంపూర్ణమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు చిట్టెం శెట్టి వెంకట సుబ్బారావు గుంటక కృష్ణ అజయ్ బట్టు పిచ్చయ్య ఆళ్లచెరువు విక్రమార్క మహిళలు అంజనాదేవి చంద్రకుమారి లక్ష్మి కోటేశ్వరి అంజమ్మ దివ్య రేణుక సావిత్రి భార్గవి ఆదిలక్ష్మి లీలావతి రాజేశ్వరి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ద్విముఖ కల్యాణ వినాయక ఆలయంలో విజయ హోమం

**అనకాపల్లి జిల్లా బ్యూరో ప్రజా ప్రతిభ మార్చి 8:**
భగవత్ భక్తి ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచదారులలో కొలువుదీరిన ద్విముఖ కల్యాణ వినాయక స్వామి వారి ఆలయంలో 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆదివారం ఘనంగా విజయ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి రాంబిల్లి అచ్చుతాపురం మునగపాక కసింకోట ఎస్ రాయవరం మండలాల నుండి సుమారు 650 మంది పదవ తరగతి విద్యార్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమములో పాల్గొన్న విద్యార్థుల చేత లక్ష్మీ గణపతి పూజ గణపతి హోమం చేయించడంతోపాటు పూజలో పాల్గొన్న విద్యార్థులందరికీ తన్నో పెన్సిల్ ఎరేజర్ మండెర్ స్వామి వారి ఫోటో అక్షింతలు కుంకం విభూది అందజేశారు. విద్యార్థులకు స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిసిటి సామాజిక కార్యకర్తలు ఎస్వీ రమణ ఎస్వి నాగేశ్వరరావు పీఏ నాయుడు బిసిటి ఐటిఐ స్టాఫ్ దేవాలయ అర్చకులు లక్ష్మీనారాయణ యు.ఎస్.ఆర్ ప్రసాదు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు





# చౌకగా రుచికరమైన ఆహారం

**నంద్యాల, మార్చి 8,(ప్రజా ప్రతిభ)**



నంద్యాల పట్టణంలో ని నాలుగు నెలలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఒక్క రూపాయికే పుల్కాలు,కర్రీ,పప్పు,ఒక్క రూపాయికే విజిటేబుల్ పలావ్,కర్రీ,ఒక్క రూపాయికే జొన్న రొట్టె.పప్పు.అతి చౌకగా రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ తమ కడుపు నింపుతున్న గోళ్ళ రాజేష్ ను సంతోషంగా మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్న ప్రజలు.నంద్యాల వాస్తవ్యులు,ప్రముఖ పారిశ్రామికవేత్త,సామాజికవేత్త నంద్యాల నియోజకవర్గంలో గడిచిన నాలుగు నెలల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు, సహాయ సహకారాలు, ఆర్థిక సహకారాలు అందిస్తూ వస్తున్నారు.ఒక రూపాయికి వాటర్ పాయింట్, చిన్నపిల్లల చాక్లేట్లు కూడా రాని ఈరోజుల్లో ఎవరు ఆకలితో ఉండకూడదని మంచి సదుద్దేశంతో ప్రతి ఒక్కరికి అందుబాటులో అతి చౌకగా కడుపు నింపుకునే విధంగా వెసులుబాటును కల్పిస్తూ కేవలం ఒక్క రూపాయికే రెండు పుల్కాలు కర్రీ పప్పు, ఒక వెజిటేబుల్ బిర్యాని కర్రీ, 1 రూపాయికే జొన్న రొట్టె,పప్పు మంచి నాణ్యతతో రుచికరమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ప్రజలు కూడా కేవలం ఒక రూపాయికే ఆహారాన్ని అందిస్తున్నందుకు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు కేవలం ఒక రూపాయికి రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ తమ కడుపు నింపుతున్న గోళ్ళ రాజేష్ కి కృతజ్ఞతలు,ధన్యవాదాలు తమ ఆశీస్సులు అందిస్తున్నందుకు నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము అదేవిధంగా రానున్న రోజుల్లో మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు గోళ్ళ రాజేష్ ఎల్లప్పుడూ ముందుంటారని తెలియజేసేందుకు ఎన్నో రకాలుగా ప్రత్యక్ష సాక్షాలు ఉన్నాయనడానికి ఎంతోసంతోషం వ్యక్తం చేస్తున్నాము.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**- స్త్రీ వ్యాధులపై వైద్య సదస్సు**

**నిర్వహించిన నంద్యాల గైనకాలాజి సొసైటీ**

**- మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత: డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ**




**నంద్యాల, మార్చి 8,(ప్రజా ప్రతిభ )**

ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల గైనకాలాజి సొసైటీ, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో, గైనకాలాజి సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, కోశాధికారి డాక్టర్ సునీత ల నిర్వహణలో మధుమణి సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో గైనకాలాజి సొసైటీ స్త్రీ వ్యాధుల పై వైద్య సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ ఇందుమతి, డాక్టర్ వసుధ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ గీత, డాక్టర్ శిల్పా, డాక్టర్ సునీత వివిధ స్త్రీ వ్యాధులపై మల్టీ మీడియా సహకారంతో ప్రసంగించారు.ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐ ఎం ఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఐ ఎం ఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళ లను అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ “గివ్ టు గైయిన్” నినాదం ప్రకారం మహిళల హక్కులు,సామాజిక న్యాయం కోసం కార్యచరణ ప్రధానం అన్నారు.ఈ సందర్భంగా సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం చేశారు.నవజీవన్ బధిరుల పాఠశాల బాలికలకు రెండు కుట్టు మిషన్లు కుట్టు పని శిక్షణ కోసం మహిళా వైద్యుల తరఫున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా వైద్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కళ్యాణ మహోత్సవ రాట



**అనకాపల్లి జిల్లా బ్యూరో/అచ్చుతాపురం: ప్రజా ప్రతిభ మార్చి 8:**

పద్మశాలీల ఆరాధ్యదైవమైన శ్రీశ్రీశ్రీ భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కల్యాణ మహోత్సవ ఆట కార్యక్రమం ఆదివారం దుప్పుతురు గ్రామంలో ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ మాడెం సూరి అప్పారావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు ఉప సర్పంచ్ దేశంశెట్టి ఈశ్వరరావు మది పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు ప్రగడ కొండలరావు ప్రగడ భవాని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పద్మశాలీల కుల పెద్దలు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు; ఆంధ్రప్రదేశ్ పద్మశాలి పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లపు వెంకటేశ్వర్లు, స్టీల్ ప్లాంట్ పద్మశాలి సంఘం అధ్యక్షులు శేసెట్టి అప్పారావు ;వానపల్లి జగ్గారావు, డాక్టర్ డిరాజు ,గ్రామ కమ్యూనిటీ పెద్దలు మాడెం ఈశ్వరరావు, శేశెట్టి రాంబాబు ఎమ్ అప్పారావు; ఆముదూరి అప్పలరాజు వానపల్లి సన్యాసిరావు వానపల్లి రమణమ్మ మాడెం లక్ష్మి రాంబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వాళ్ళ కళ్యాణ మహోత్సవ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్చి 20 తేదీన జరిగే కళ్యాణ మహోత్సవం పురస్కరించుకొని 19వ తేదీన పత్రి పూజలు నిర్వహించడంతోపాటు 20వ తేదీన తెల్లవారుజాము నుండి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారని కమిటీ చైర్మన్ అప్పారావు తెలిపారు స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో పలు ఆధ్యాత్మిక సంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు
౹7:36 జూఎ, 08/03/2026ి ం91 96668 30404: జుఅన

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో నిర్వహించిన, అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమానికి హాజరైన మహిళల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కీలక శక్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, వ్యాపారం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో మహిళలు ముందుకు రావడం సమాజ అభివృద్ధికి అవసరమని తెలిపారు.మన దేశంలో వివాహ బంధానికి ఉన్న విలువ ప్రపంచంలోని అనేక దేశాల్లో కనిపించదన్నారు. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితం అనే భావన ఉండేదని, కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. మహిళలు ప్రతిభతో అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.మహిళల స్వేచ్ఛ, సమానత్వానికి పునాది వేసిన నాయకుల్లో ఒకరైన స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు.1983లో మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం మహిళా సాధికారతకు దారితీసిందన్నారు. అలాగే మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి కుటుంబాల్లో వారికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం కలిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించి సమాజంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచి పేరు గౌరవం తెచ్చుకున్న మహిళలను సభలో సత్కరించారు. రచన, కవిత్వంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రైల్వే ఉద్యోగి షేక్ షకీలా, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు బోనేని రవణమ్మ, సభల్లో చక్కటి ప్రసంగాలతో గుర్తింపు పొందిన నక్కా రమ్య, రెండు కళ్లకు చూపు లేకపోయినా ఉన్నత స్థాయికి ఎదిగి గ్రేడ్--2 ఉద్యోగం సాధించి ప్రస్తుతం అర్ధవీడు ప్రాంతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా, విద్యాధికారి బాధ్యతలు నిర్వహిస్తున్న సుజాతలను



ఎమ్మెల్యే శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.కష్టసాధ్య పరిస్థితుల్లో కూడా పట్టుదలతో ముందుకు సాగి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న మహిళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళల పురోగతి దేశ అభివృద్ధికి బాటలు వేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల బియ్యం అక్రమ రవాణా జోరుగా,

# పెద్దారవీడు మండలంలో నెలకు సుమారు 100 టన్నుల బియ్యం మాయం.

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 08, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పెద్దారవీడు మండలంలో అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నెలనెలా పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం భారీ స్థాయిలో అక్రమంగా చేతులు మారుతుండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యం దెబ్బతింటోంది.అధికార రాజకీయ అండదండలతో ఈ అక్రమ వ్యాపారం నిరంతరంగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మండలంలో ప్రతి నెలా సుమారు 100 టన్నుల వరకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. పేదల కోసం పంపిణీ చేయాల్సిన బియ్యం మూడు దశల్లో చేతులు మారుతూ చివరికి మిల్లర్లకు చేరుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.మొదటి దశలో కార్డుదారుల నుంచి బియ్యాన్ని డీలర్లు కిలోకు సుమారు 12 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్డుదారుల వేలిముద్రలు తీసుకొని రేషన్ సరుకును పొందిన తర్వాత అదే బియ్యాన్ని డీలర్లు నిల్వ ఉంచుతున్నారు. తర్వాతి దశలో ఈ బియ్యాన్ని కొందరు స్థానిక రాజకీయ నాయకులు కిలోకు సుమారు 15 రూపాయల ధరకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.మధ్యవర్తుల ద్వారా ఈ బియ్యం మిల్లర్లకు చేరుతుంది. మిల్లర్లు కిలోకు 18 నుంచి 25 రూపాయల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా పేదలకు ఇవ్వాల్సిన బియ్యం భారీ లాభాలతో అక్రమ వ్యాపారంగా మారిందని ప్రజలు అంటున్నారు.పెద్దారవీడు మండలంతో పాటు త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు చెందిన కొందరు స్థానిక నాయకులు ఈ బియ్యాన్ని వినుకొండ ప్రాంతానికి తరలిస్తున్నట్లు కూడా సమాచారం వెలువడుతోంది. లారీల ద్వారా రాత్రివేళల్లో రవాణా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.ప్రతి నెలా ఇంత పెద్ద స్థాయిలో అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ అధికారుల చర్యలు కనిపించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. కొందరు అధికారులు నెలసరి మామూళ్లు తీసుకుంటూ అక్రమ వ్యాపారులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఇక కొందరు డీలర్లు మాత్రం తమకు ఈ వ్యవహారంలో పెద్దగా లాభం లేదని వాపోతున్నారు. చెడ్డపేరు మాత్రం తమపై పడుతుందని, అధికారులకు మామూళ్లు ఇచ్చిన తర్వాత తమకు మిగిలేది చాలా తక్కువగా ఉంటుందని అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.ఎవరికి ఎంత వరకు ప్రయోజనం






లభించినప్పటికీ పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోవడం మాత్రం ఆగడం లేదు. ఈ వ్యవహారంపై అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే విచారణ చేపట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళల సంక్షేమానికి విస్తృత పథకాలు

**- ఐదేళ్లలో లక్షల కోట్ల సాయం వైఎస్ జగన్.**




**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 08,(ప్రజా ప్రతిభ):**

రాష్ట్రంలో మహిళల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని గత ప్రభుత్వ కాలంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలు ఇప్పటికీ ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పలు రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసినట్లు లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. గర్భిణుల నుంచి వృద్ధ మహిళల వరకు అన్ని వయసుల మహిళలకు సంక్షేమం చేరే విధంగా పథకాలు రూపొందించినట్లు అప్పటి గణాంకాలు తెలియజేస్తున్నాయి.గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు.కడుపులో ఉన్న బిడ్డకు సంపూర్ణ పోషణ అందించే లక్ష్యంతో ప్రతి నెలా పౌష్టికాహారంతో కూడిన సంచులు అందజేశారు.గర్భిణులు, బాలింతలకు అవసరమైన ధాన్యాలు, పప్పులు, పౌష్టికాహార పదార్థాలు అందించి తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు చేపట్టారు.ప్రసూతి సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు తల్లీ బిడ్డ రవాణా సేవలను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉంచారు.ఈ సేవల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా గర్భిణులకు సమయానికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు.పిల్లలను బడికి పంపే తల్లులకు ఆర్థికంగా తోడ్పడే లక్ష్యంతో అమలు చేసిన అమ్మ ఒడి పథకం లక్షలాది కుటుంబాలకు ఉపయోగపడింది. ప్రతి సంవత్సరం రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో పేద కుటుంబాలకు విద్యాభారం కొంత తగ్గింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 44.48 లక్షల మంది తల్లులకు రూ.26,067 కోట్లను నేరుగా అందించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక అడ్డంకులు తొలగించేందుకు విద్యాదీవెన పథకం అమలు చేశారు. కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం భరించే విధంగా ఈ పథకం అమలు చేశారు.ఈ కార్యక్రమం ద్వారా 29.65 లక్షల మంది విద్యార్థులకు రూ.12,609 కోట్ల సాయం అందినట్లు అధికారిక సమాచారం తెలిపింది. దీంతో పేద కుటుంబాల విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవకాశం లభించింది.మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలకు పెద్దపీట వేశారు. ఆసరా పథకం ద్వారా మహిళా



సంఘాల రుణాలకు సున్నా వడ్డీ సౌకర్యం కల్పించారు. త్రైమాసికం ముగిసిన వెంటనే రుణాలపై వడ్డీ భారం ప్రభుత్వం భరించే విధంగా సాయం అందించారు. దీంతో మహిళా సంఘాలు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు.మధ్య వయస్సు మహిళల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి చేయూత పథకం అమలు చేశారు. 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ప్రతి సంవత్సరం రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో సాయం అందించారు. ఈ పథకం ద్వారా 26.98 లక్షల మంది మహిళలకు రూ.19,189 కోట్ల లబ్ధి చేకూరినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.కాపు మహిళల కోసం ప్రత్యేకంగా కాపు నేస్తం పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి సంవత్సరం రూ.15 వేల చొప్పున నాలుగు విడతల్లో సాయం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.58 లక్షల మంది మహిళలకు రూ.2,029 కోట్ల సాయం అందినట్లు సమాచారం.పేద కుటుంబాల అమ్మాయిల వివాహాలకు ఆర్థికంగా తోడ్పడే లక్ష్యంతో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు అమలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల వివాహానికి రూ.లక్ష వరకు సాయం అందించారు. బీసీ మహిళల వివాహానికి రూ.50 వేల సాయం అందించారు.విభిన్న ప్రతిభ కలిగిన మహిళలకు రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించారు. ఈ పథకాల ద్వారా మొత్తం 56,194 మందికి రూ.427 కోట్ల సాయం అందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.మహిళల సంక్షేమానికి నేరుగా ఖాతాల్లో జమ చేసే పథకాలతో పాటు ఇతర కార్యక్రమాలు కూడా అమలు చేశారు. మొత్తం ఐదేళ్ల కాలంలో మహిళల సంక్షేమం కోసం నేరుగా ఖాతాల్లో జమ చేసే పథకాలు, ఇతర కార్యక్రమాల కింద సుమారు రూ.2.83 లక్షల కోట్లను ఖర్చు చేసినట్లు అప్పటి గణాంకాలు చెబుతున్నాయి.పాలనను ప్రజల దగ్గరకు తీసుకెళ్లే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయాల్లో కొత్తగా 1.27 లక్షల ఉద్యోగాలు కల్పించగా అందులో 63,791 ఉద్యోగాలు మహిళలకు దక్కాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి.వైద్య ఆరోగ్య శాఖలో కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేశారు. ఐదేళ్ల కాలంలో దాదాపు 53 వేల ఉద్యోగాలు భర్తీ చేయగా అందులో మూడొంతులు మహిళలకే ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆరోగ్య రంగంలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది.పేద మహిళలకు స్వంత ఇంటి కల నెరవేర్చే లక్ష్య...

# రోడ్డు పై సంత.. ప్రజలకు తీరని చింత

- పాములపాడు మండలం లో వారాంతపు సంతతో వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
- రోడ్డుపైనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- ట్రాఫిక్ వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం
- చూసి చూడనట్టుగా పట్టించుకోని అధికారులు





**నంద్యాల బ్యూరో మార్చి 08 ప్రజా ప్రతిభ:**

నంద్యాల జిల్లా పాములపాడు మండలంలో వారాంతపు సంతతో వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కొన్ని సంవత్సరాలుగా వారాంతపు సంత రోడ్డుపైనే కొనసాగడంతో.. వాహనాలు ఎదురెదురుగా వస్తే అంతే సంగతులు దీంతో గంటల తరబడి వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.ఎక్కడైనా ప్రమాదం చోటుచేసుకుంటే ఆ రహదారిలో 108 వాహనం వస్తే సైతం ఆగాల్సిందే. ట్రాఫిక్ ఏర్పడటం వల్ల మార్కెట్ వచ్చే వారికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కూరగాయల వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారం చేసుకుంటున్నారు. వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారం చేసుకుంటున్నారు. గతంలో పలుమార్లు ఈ విషయంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కకపోవడంతో వ్యాపారులు చేసేది లేక రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్నారు. గుత్తేదారు మాత్రం ముక్కుపిండి వ్యాపారుల నుంచి రుసుము వసూలు చేసుకుంటున్నారు.

**తప్పని తిప్పలు :**

మండలంలో వారం వారం నిర్వహించే సంతకు వ్యాపారం చేసుకోవడానికి వచ్చే చిరు వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ సంతలో చిరు వ్యాపారులు, కూరగాయలు, పప్పు దినుసులు మొదలుకొని అన్ని రకాల వస్తువుల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. గమనించాల్సిన విషయం కానీ ఏమిటంటే వ్యాపారస్తులకు కావలసిన కనీస సౌకర్యాలు కొనుక్కోవడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంత నిర్వహణకు సరైన స్థలం లేకపోవడంతో రహదారులకు ఇరువైపులా సరుకులను విక్రయిస్తున్నారు. సంత నిర్వహించే సమయంలో ప్రజలు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇ బ్బందులు పడుతున్నారు. వర్షం వస్తేచాలు వారు తెచ్చిన సరుకులు తడువకుండా భద్రపర్చలేక నష్టపోతున్నారు. గాలులు వీచిన సమయంలో వస్తువులు చెల్లాచెదురు కాకుండా రక్షించుకోవడం తలకుమించిన భారం అవుతోంది. తమకు ప్రత్యేకంగా ఒక స్థలంకేటాయించి వ్యాపార సముదాయాలను నిర్మించి ఇస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**పట్టించుకోని అధికారులు :**

రోడ్లపై సంత ఉండటంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని తెలిసిన అధికారుల సైతం పట్టించుకోవడం లేదనీ ప్రజల నుంచి విమర్శనలు వస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లపై వ్యాపారులు పండ్లు విక్రయించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ అధికారుల సిబ్బంది సమస్య పరిష్కరించాల్సింది పోయి తమకేమి పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారనీ ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వాహనదారులు ఆదివారం వస్తే చాలు వద్దురా బాబు ఈ సంతలో ట్రాఫిక్ భరించలేమన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సీఎం చంద్రబాబు పర్యటనకు సర్వం సిద్ధం..

- ముఖ్యమంత్రి పర్యటనకు సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు...
- భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ
- నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి....
- సీఎం పర్యటనలో బందోబస్తు ఏర్పాటు.
- జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





**నంద్యాల బ్యూరో మార్చి 08,ప్రజా ప్రతిభ :**

నంద్యాల జిల్లా కొత్త బురుజు గ్రామం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్న స్పెషల్ పోలీస్ బలగాలు.. సిసి కెమెరాలతో మరియు డ్రోన్ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించరాదనీ ఎస్పీ సునీల్ షోరాణ్ అన్నారు.నంద్యాల జిల్లాలోని డోన్ మండలం కొత్తబురుజు గ్రామం నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న సందర్భంగా సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగింది.ఇప్పటికే కొత్త బురుజు గ్రామం మరియు పరిసర ప్రాంతాలను ఇప్పటికే స్పెషల్ పార్టీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు జరిగింది. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పోలీస్ జాగిలాలతో మరియు బాంబు డిటెక్షన్ టీం సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది.సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలతో నిరంతరం భద్రతా పర్యవేక్షణ జరుగుతుంది. కొత్తబురుజు గ్రామంలో నిర్వహించే సభా ప్రాంగణానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

**సిబ్బందికి సూచనలు :**

బందోబస్తుకు వచ్చిన అధికారులను సిబ్బందిని సమావేశపరిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఎట్టి పరిస్థితులలో మీకు నియమించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళ రాదు.ప్రజలు ఎక్కువగా తరలివచ్చే అవకాశం ఉన్నందున మీరు విధులు నిర్వహించు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలి. డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, మీకు అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు.

# మాడగడ సూపర్ సర్పంచ్ బాలరాజు పై పంచాయతీ కార్యదర్శి దాడి

**అరకు లోయ, మార్చి 8 ( ప్రజా ప్రతిభ):**



అల్లూరి జిల్లా అరకువేలి మండలం మాడగడ గ్రామపంచాయతీ సర్పంచ్ పాడి బారికి జ్యోతి భర్త ఆయన మండ్యాకేడి బాలరాజు పైన మాడగాడ పంచాయతీ కార్యదర్శి బడిద బోయిన. భోగి రాజు,తో పాటు చిన్నలబుడు కార్యదర్శి మహేష్, పద్మాపురం కార్యదర్శి పాత్రుడు వారితో కలిసి దాడి చేసి హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించారు అని బాలరాజు అన్నారు. నేను అనగా బాలరాజు సూపర్ సర్పంచ్ ఒక ఆదివాసి గిరిజన జాతికి చెందిన వాడిని పైగా 45% వికలాంగువాడును నాపై పంచాయతీ కార్యదర్శి దాడి చేసి అత్యయత్నం చేశారు. మాడగడ గ్రామపంచాయతీలో పకనకుడి, గంగగుడి, కాగువలస గ్రామాలలో రక్షిత మంచినీరు కల్పించే పనులు చెయ్యగా ఎందుకు ఏం బుక్ రికార్డింగ్ చేసి రెండు నెలలు గడుస్తున్న ఎందుకు బిల్లులు చెల్లించలేదని పంచాయతీ కార్యదర్శి అయిన బడిద బోయిన భోగిరాజు అడగగా ఈరోజు రేపు అని చెప్పి చెల్లిస్తానని ఉద్దేశ పూర్వకంగా బిల్లు చెల్లించే పోయేసరికి తేదీ మార్చి 5వ తారీఖున రాత్రి సుమారు 9 గంటల సమయానికి లక్కీ టిఫిన్ షాప్ వద్ద కార్యదర్శి ఉండగా నేను ఫోన్ చేయగా కార్యదర్శి రండి అని చెప్పగా నేను వెళ్ళాను కార్యదర్శి ఒకసారి మా రూమ్ లో రండి అని చెప్పారు మరల నేను నిజమా కాదా అని తెలుసుకోవడానికి ఫోన్ చేయగా వారు నా రూంలో రావలసిందిగా కోరారు అప్పటికి నేను వెళ్లాను అంతలోనే ఆయన ఉద్దేశపూర్వకముగా ఫోన్ స్విచాఫ్ చేశారు. దాంతో వారి రూమ్ బయట నిలబడ్డాను చాలాసేపు బయటకి తలుపులు తీయవలసిందిగా రిక్వెస్ట్ చేశాక బడిద బోయిన భోగిరాజు కార్యదర్శి మరియు కొంతమంది సహాయ ఉద్యోగులు ఉద్దేశపూర్వకముగా ఈ కొండ లంజా కొడుకుకి వేల పాట లేదా చొట్ట లంజా కొడకా అని కులం పేరుతో దూషించి ఏం పీకుతావ్ రా పీక్కో అని నాకు వేలన్న చేశారు. మాడగాడ కార్యదర్శి అయిన



భోగిరాజు కొండ లంజా కొడకా చొట్ట లంజా కొడకా అని చెప్పి నీకు ఈరోజు ఉంచాను రా అని చెప్పి పగిలిన గాజు ముక్కతో నా చెయ్యిని బలంగా పొడిచాడు. దాంతో నేను బాధతో కేకలు వేయగా సమీపంలో ఉన్న నా మిత్రులు మణికంఠకు సమాచారం ఇవ్వగా వారి ద్వారా ఆస్పత్రికి తరలించడం జరిగింది. పంచాయతీలో అభివృద్ధిలో పెట్టిన నిధుల కోసం బిల్లుల కోసం పంచాయతీ కార్యదర్శి కి అడిగితే తనపై హత్యాయత్నం చేశారని బాలరాజు అన్నారు. బాలరాజు పై దాడికి పాల్పడిన వారిని పోలీసు వారు చట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# త్రాగునీరు సౌకర్యం కల్పించండి

- కాలి బిందెలతో మహిళలు వినూత్న నిరసన.
- అధికారుల చుట్టూ వినతి పత్రాలు.... వినతి పట్టించుకోరేం...





**అనంతగిరి, మార్చి 8 (ప్రజాప్రతిభ ):**

ఆంధ్రప్రదేశ్‌లో 2028 డిసెంబరు నాటికి అన్ని గ్రామాలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అందుకు అనుగుణంగా జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు, కొత్త బోర్లు, మరియు మంచినీటి ట్యాంకుల మరమ్మతులు ( ఓహెచ్ఎస్ఆర్ ) వంటి పనులు గ్రామపంచాయతీల ద్వారా చేపడుతునా..... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నరసింహారాజపురం ( ఎన్ ఆర్ పురం) పంచాయితీ నాయుడువలస గ్రామం లో నేటికీ కనీస మంచినీళ్లు సౌకర్యం కల్పించలేదు ఈ ప్రభుత్వం. దాంతో ఎన్నో ఏళ్లుగా మంచినీటి సమస్య ఎదుర్కొంటున్న మహిళలు ఒక్కసారిగా విస్తుపోయి ఖాళీ బిందెలతో ఊటగడ్డ వద్ద ఆందోళన చేపట్టారు. నాయుడుపాలెం గ్రామంలో సుమారు 50 కుటుంబాలు చాలా ఏళ్లుగా జీవనం సాగిస్తున్నామని, తమ గ్రామానికి మంచినీరు సౌకర్యం లేకపోవడంతో రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు లేక నోరుఎండిపోతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారన్నారు. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగిన ఫోటోలు తీసుకుని వెళ్తున్నారు తప్ప ఇప్పటివరకు మంచినీరు మా ప్రాంతానికి ఇవ్వలేదని మండుతున్న ఎండల్లో పిల్లా పాపలతో అల్లాడిపోతున్నామన్నారు. తక్షణం జిల్లా కలెక్టర్ స్పందించి మాకు మంచి నీటి సౌకర్యం కల్పించి మా దాహార్తిని తీర్చాలని ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో కలెక్టరేట్ ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

# జఫ్ఫార్, లక్ష్మీపురం, లబ్బూరు గ్రామాలలో పర్యటించిన

### జేఏసీ అల్లూరి జిల్లా చైర్మన్ రామారావు దొర





**అరకులోయ, మర్చి 8( ప్రజాప్రతిభ ):**

ముంచంగిపుట్టు మండలంలోని ఆదివారం జఫ్ఫార్ మరియు లక్ష్మీపురం, లబ్బూరు గ్రామాలలో సందర్శించి, ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ద్వారా గ్రామస్తులతో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం గురించి వివరించడం జరిగింది. జేఏసీ అల్లూరి జిల్లా చైర్మన్ రామారావు దొర మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం మన గిరిజన నిరుద్యోగులకు గుండెకాయ వంటి జీవో నెంబర్ 3 తీసిస్తే గత మన రాష్ట్ర ప్రభుత్వం కనీసం రివ్యూ పిటిషన్ వేసి కనీసం వాదనలు వినిపించకోవడం చాలా దుర్మార్గం, అలాగే ఇప్పుడు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదివాసులకు జీవో నంబర్ 3 కి ప్రయత్నంనయ చట్టం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చి మాట మారుస్తున్నారన్నారు. 2025 మెగా డీఎస్సీ ద్వారా ఆదివాసులకు తీవ్ర నష్టం వాటిల్లిన కనీసం మనకు నిమ్మకు నీరెత్తలేదు, కాబట్టి ఎవ్వరు రోడ్లపై వచ్చి ఉద్యమాలు మర్చిపోయారు. ఈ రోజు మన కుటుంబం లో ఒకరికి ఉద్యోగం వస్తే ఒక కుటుంబం మొత్తం ఆధారపడి జీవిస్తాం, దయచేసి తల్లిదండ్రులు కూడా ఆలోచించాలి. ఏప్రిల్ 3 వ తారీకుని పాడేరు లో జరిగే బహిరంగ ర్యాలీకి ప్రతి ఒక్క నిరుద్యోగులకు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ రోజు తో 121 వ రోజుకు ఆదివాసి సత్యాగ్రహ యాత్ర చేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రామారావు దొర, మణుగూరు బాబుజీ (జేఏసీ మీడియా ప్రతినిధి) వంతాల కామేశ్వరరావు, బూడిదే మాధవ రావు (జేఏసీ కో కన్వీనర్) పార్థసారథి, మరియు గ్రామస్తులు పాల్గోవడం జరిగింది.

https://prajaprathibha.com
RNI: APTEL 2013/54721

# బుట్టాయిగూడెంలో మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళామణులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళల అభివృద్ధికి చిరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచన
- భారీగా పాల్గొన్న డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ వర్కర్లు



**పోలవరం ప్రతినిధి, మార్చి 08 (ప్రజా ప్రతిభ) :**

పోలవరం నియోజకవర్గం బుట్టాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చిరు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ప్రతి వంద మంది మహిళల్లో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, దీనిపై కూటమి ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం, ఆహారపు అలవాట్ల పట్ల నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ దేశానికి గౌరవం తెస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, అంగన్వాడీ వర్కర్లు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# జోరుగా గడపగడపకు సీపీఐ



**కుక్కునూరు, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు సీపీఐ కార్యక్రమం కుక్కునూరు మండలంలో జోరుగా కొనసాగుతుంది. శుక్రవారం పెదరాయిగూడెం, కివ్వాక గ్రామాల్లో నాయకులు గడపగడపకు తిరిగి విరాళాలను సేకరించారు. అనంతరం సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె. లక్ష్మయ్య మాట్లాడుతూ కార్మిక, కర్షక హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకున్న ఘనత ఒక్క సీపీఐకి మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు. కాగా వేసవి దృష్టా గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆయిన డిమాండ్ చేశారు. కాగా గడపగడపకు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తుంది. దివ్యాంగుల సైతం విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల, మైసాక్షి. వెంకటాచారి, కురాకుల. బాబూరావు, పల్లెల. భిక్షం, సోడే. నాగేష్, సోడే. ఇరమయ్య, మల్లయ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెలో బిగ్ స్క్రీన్ పై టి20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్



**వర రామచంద్రపురం, మార్చి 8 (ప్రజా ప్రతిభ)**

మండల పరిధిలో ఉన్న రేఖపల్లి లోని కోట మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బిగ్ స్క్రీన్ పై క్రికెట్ మ్యాచ్ అలాగే పెద్ద మట్టపల్లి గ్రౌండ్లో బిగ్ స్క్రీన్ తో 2026 ఐసిసి టి 20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ (భారత్ జం న్యూజిలాండ్) మార్చి 8న, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతుంది. ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌ను వీక్షించేందుకు గ్రామాలలో భారీ గా ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో కలిసి ఈ మ్యాచ్‌ను ఆస్వాదించడానికి వచ్చారు. ఈ మ్యాచ్‌పై ఉత్సాహాన్ని, జట్టుకు మద్దతును పెంచుతుంది అని అభిమానులు తెలిపారు

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- బుట్టాయగూడెం జూనియర్ కాలేజ్ మైదానంలో భారీగా మహిళా దినోత్సవ వేడుకలు
- 59,341 మంది డ్వాక్రా మహిళలకు రూ.378.36 కోట్ల రుణాల చెక్కుల పంపిణీ
- వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు సన్మానం





**పోలవరం ప్రతినిధి, మార్చి 08 (ప్రజా ప్రతిభ) :**

బుట్టాయగూడెం మండలంలోని జూనియర్ కాలేజ్ మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారికి బలమైన వేదికను అందిస్తోందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచి సమాజానికి ఆదర్శంగా నిలిచిన పలువురు మహిళలను సభలో సన్మానించారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి వారిని అభినందించారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ప్రతిభను ప్రోత్సహించడం సమాజ పురోగతికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పథకాల కింద రుణాల మంజూరు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 59,341 మంది డ్వాక్రా మహిళలకు రూ.378 కోట్ల 36 లక్షల విలువైన రుణాల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ రుణాలు మహిళల స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల అభివృద్ధి మరియు కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాములు నాయక్, డీడీ జగన్నాథరావు, సెర్ప్ ఏపిడి రాజబాబు, బుట్టాయగూడెం ఎంపీపీ తెల్లం రమణ, సర్పంచ్ తెల్ల వెంకయ్యమ్మ, ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరబం శ్రీనివాసులు, సాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, జనసేన నాయకులు గడ్డమనగు రవికుమార్, కరాటం సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే గ్యాస్

# ధరలు పెంచి వంటింటి మహిళల నడ్డి విరిచిన ప్రధాని

**కుక్కునూరు, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**




కుక్కునూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జాతీయ, రాష్ట్ర పిలుపుమేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న సోడె వెంకమ్మ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల ముఖ్యఅతిథిగా హాజరై జండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ మహిళలపై హింసకు వ్యతిరేకంగా, న్యాయమైన శాంతియుత సమాజం కోసం ఐక్యంగా పోరాడుదాం అన్నారు. జర్మనీ సోషలిస్ట్ డెమోక్రటిక్ ఉద్యమ నాయకురాలు క్లారాజెట్కిన్ మహిళా కార్మికులకు మెరుగైన వేతనాలు, సమాన పనికి సమాన వేతనం పని గంటలు తగ్గింపు, ఓటు హక్కు, ప్రసూతి సెలవులు, లింగ వివక్షతకు వ్యతిరేకంగా, సమానత్వం సాధన కోరుతూ శ్రామిక మహిళలు చేసిన పోరాట ఫలితమే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావం జరిగిందన్నారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కోసం గీతా ముఖర్జీ రేణు చక్రవర్తి లాంటి మహిళ నేతలు సుదీర్ఘ పోరాటాలు చేశారన్నారు. తోలుతా మహిళా బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి రాజ్యసభలో ఆమోదింపజేసిన ఘనత గీతా ముఖర్జీని ఉన్నారు. సమాజంలో మహిళలను గౌరవించాలి అన్నాడు మహిళలు ఆర్థికంగాను సామాజికంగాను రాజకీయంగాను ఎదగాలన్నారు విద్య వల్లనే సాధికారత సాధ్యమన్నారు. గంగాయి డ్రగ్స్ మాదకద్రవ్యాల వల్ల దేశంలో మహిళలపై చిన్నారి బాలికల దగ్గర నుండి పెద్దవాళ్ల వరకు ఎవరిని విడిచిపెట్టకుండా అత్యాచారాలు లైంగిక దాడులు చేసిన మానవ మృగాలలో ఒకరినైనా ఈ భారత ప్రభుత్వం చరిత్రలో ఉరితీసారా..? కనీసం ప్రజల ముందు శిక్షించారా..?ఎందుకు భారత ప్రభుత్వం శిక్షించలేక పోతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్యగా ప్రశ్న ఇస్తున్నాను. అర్హులైన నిరుపేదలకు సొంత ఇంటి కలని పట్టణాలలో రెండు సెంట్లు స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకొనుటకు ఐదు లక్షలు ఇవ్వాలని, అంటే ఇంట్లో ఉన్న వారందరికీ ఇవ్వాలని ఎస్సి, ఎస్టీ ,బిసి, మైనార్టీ, సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలని, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల డిమాండ్ చేశారు. 21 నెలలు గడిచిన ఓటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ లో భాగంగా నిరుద్యోగులకు ఇంట్లో ఎంతమంది చదువుకొని ఉంటే వారికి నెలకు పదిహేను వందల రూపాయలు ఇస్తామన్నారు ఏమైంది అని ప్రశ్నించారు.

# ఘనంగా క్రేయాన్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవం

- చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్న వేడుక





**విశాఖ బ్యూరో సత్య , మార్చ్ 8 ( ప్రజా ప్రతిభ ):**

క్రేయాన్స్ చిన్నారుల విద్యాలయం వార్షికోత్సవ కార్యక్రమం విద్యాలయ నిర్వాహకులు బోయిన గోవర్ధనరావు మరియు పెంట కార్తీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ స్థల వ్యాపారవేత్త శ్రీకాంత్ మరియు ఎన్ఆర్ఐ వైద్య విద్యా అకాడమీ అనాటమీ విభాగంలో సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తున్న డాక్టర్ వనజాక్షి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయ యాజమాన్యం అతిథులను పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించింది. విద్యాలయ ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్న కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ వనజాక్షి తల్లిదండ్రులను ఉద్దేశించి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, మార్గదర్శనం ఎంతో ముఖ్యమని వివరించారు. చిన్న వయసులోనే పిల్లల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకత పెంపొందించాలని సూచించారు. తదనంతరం చిన్నారులు కేరళ, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చిన్నారుల చలాకీ నృత్యాలు, వేషధారణలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి సంస్థ స్థాపకుడు రాంప్రసాద్ రగుతు గారు హాజరై చిన్నారులను అభినందించారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లలను ప్రోత్సహించడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

# వైభవంగా శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ: పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు



**విశాఖ బ్యూరో సత్య , మార్చి 08 ( ప్రజా ప్రతిభ ):**


ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి నూతన ఆలయ పునఃప్రతిష్ట మరియు రాజగోపుర కలశ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక గవరపాలెంలో వెలసిన అమ్మవారి ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతితో కలిసి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న స్పీకర్ దంపతులకు స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మేళతాళాలు మరియు పూర్ణకుంభంతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన ప్రధాన ఆలయ మండపంలో నిర్వహించిన పసిడి కలశాల నీరాజనం మరియు కలశ ప్రతిష్టా కార్యక్రమాల్లో వారు శాస్త్రోక్తంగా పాలుపంచుకున్నారు.? అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ దంపతులు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దంపతులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను తదితరులు తమ సతీమణులతో కలిసి పాల్గొన్నారు.?ఈ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో పులకించింది. కోలాటాలు, శక్తి వేషధారణలు, భరతనాట్య ప్రదర్శనలు మరియు కేరళ డప్పు వాయిద్యాల హోరుతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అనకాపల్లి పురవీధులు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి ఆశీస్సుల కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు.

# అనకాపల్లి పర్యటనలో రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు

**- శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు**

**విశాఖ బ్యూరో సత్య, మార్చి 8 (ప్రజా ప్రతిభ):**

రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు తమ అనకాపల్లి పర్యటనలో భాగంగా సతీసమేతంగా అనకాపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనను ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు భక్తులు ఘనంగా స్వాగతించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి, దేవస్థానం తరపున శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇదే సందర్భంలో విశాఖపట్నం అదనపు ప్రభుత్వ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు తమ స్వస్థలమైన పాత కన్నూరు పాలెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామ ప్రజలు, యువకులు మరియు మహిళలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఉన్న శ్రీ ముత్యమాంబ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు కలిసి ఆయనను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఇటీవల విశాఖపట్నంలో అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన సందర్భంగా కన్నూరు అప్పలనాయుడుకి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. గ్రామానికి గర్వకారణంగా నిలిచిన ఆయన మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత, మహిళలు మరియు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదేవిధంగా గ్రామ ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా పాత కన్నూరు పాలెం గ్రామానికి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామ అభివృద్ధి వేగవంతం కావాలంటే మరియు మౌలిక సదుపాయాలు మెరుగుపడాలంటే స్వంత పంచాయతీ అవసరమని వారు వివరించారు. తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్య సదుపాయాలు



వంటి సమస్యలను కూడా ఆయనకు వివరించారు.ఈ సందర్భంగా ప్రజలకు సమాచార హక్కు చట్టం--2005 గురించి అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా సాధారణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల నుండి అవసరమైన సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉన్నారని వివరించారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకుని ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే పారదర్శక పరిపాలనకు దోహదం అవుతుందని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి పరవశంగా, ఉత్సాహభరితంగా మరియు సాంప్రదాయబద్ధంగా జరిగింది.

# ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

**- బకాయదారులకు అధికారుల సూచనలు**

**- హోటళ్లు, షాపులపై తనిఖీలు**

**- నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం**

**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8 (ప్రజా ప్రతిభ):**

పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం మారేడుమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంకా ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ అధికారి సూచించారు. గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రత్యేకంగా ఇంటింటికి వెళ్లి బకాయి పన్నులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు సక్రమంగా కొనసాగాలంటే ప్రజలు తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించడం ఎంతో ముఖ్యమన్నారు. గ్రామాల్లో రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కావున బకాయిలు ఉన్న వారు ఆలస్యం చేయకుండా వెంటనే పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.అదే విధంగా గ్రామంలో ఉన్న హోటళ్లు, టీ స్టాళ్లు, దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని వ్యాపారులకు సూచించారు. గడువు ముగిసిన లేదా నిల్వ పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి పంచాయతీ కార్యదర్శి



శ్రీనివాస్, డి.వి.కోట పంచాయతీ కార్యదర్శి గంగబాబు, సున్నంపాడు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**- మహిళా సంఘాలకు కోట్ల రూపాయల రుణాలు,**

**పురస్కారాల ప్రదానం. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**

**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8(ప్రజా ప్రతిభ )**

రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి తెలిపారు. ఆదివారం రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, చింతూరు ఏఎస్పీ బి.హేమంత్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో హక్కులు కల్పించడం, 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడం వంటి నిర్ణయాలు మహిళ సాధికారతకు దోహదపడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను రెండు లక్షల నుండి ఐదు లక్షల వరకు పెంచడం జరిగిందని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం, దీపం పథకం ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం వంటి కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని మినీ అంగన్వాడీలను అంగన్వాడి కేంద్రాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.పోలవరం జిల్లాలో సుమారు 9,070 మహిళా సంఘాలు ఉన్నాయని, వాటికి బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందించి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన మహిళా సంఘాల ద్వారా వెదురు ఉత్పత్తులు, కొండచీపుర్లు, తేనె, కుంకుడు కాయలు వంటి ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం జరుగుతుందని వివరించారు.ఈ సందర్భంగా మహిళా దినోత్సవం సందర్భంగా పదిమంది మహిళలకు "మహిళ రత్న" అవార్డులు, మరో 18 మందికి ఉత్తమ మహిళ పురస్కారాలు అందజేసి సత్కరించారు. అలాగే మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.181.15 కోట్ల చెక్కులు, శ్రీనిధి ద్వారా రూ.38.48 కోట్ల చెక్కులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.అదేవిధంగా జిల్లాలో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పదిమంది విలేజ్



డెవలప్మెంట్ అధికారులకు ఉత్తమ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన బాలికలను సత్కరించారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌కు సబ్సిడీతో ట్రాక్టర్, బొలెరో వాహనం కూడా అందజేశారు.కార్యక్రమంలో జీసీసీ, పోలీస్, మెడికల్, డ్వాక్రా మహిళా సంఘాల స్టాళ్లను ముఖ్య అతిథులు సందర్శించారు. డిగ్రీ, డీఎడ్ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా దినోత్సవ సందేశాన్ని లైవ్ ద్వారా వీక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, ఏపీవోలు డిఎన్వి రమణ, రామతులసి, డిఆర్డిఎ పీడీ డి.కమలాకర్ రావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, మైనార్టీ బోర్డ్ సభ్యుడు షేక్ సుభాని, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్కే దిల్షాద్, డిఎంహెచ్‌వో పి.సరిత, ఐసిడిఎస్ పీడీ కె.ఉమా, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీలు పండ వెంకటలక్ష్మి, ఎ.బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న మహిళలకు అండగా వన్ స్టాప్ సెంటర్

**- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**

**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8(ప్రజా ప్రతిభ )**

ఆపదలో ఉన్న మహిళలకు అన్ని విధాల రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వన్ స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని రంపచోడవరం శాసనసభ్యురాలు, లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి తెలిపారు.ఆదివారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న బర్త్ వెయిటింగ్ హాలులో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్‌ను ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, చింతూరు ఏఎస్పీ బి.హేమంత్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే వివిధ సమస్యలకు ఒకేచోట పరిష్కారం కల్పించేందుకు ఈ వన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆరోగ్య సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, సెటిల్మెంట్, కౌన్సిలింగ్ వంటి ఐదు రకాల సేవలు మహిళలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.గృహహింస, అత్యాచారం, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాపింగ్, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు వంటి ఘటనల్లో బాధిత మహిళలకు ఈ కేంద్రం ద్వారా తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. జిల్లాలోని



మహిళలు ఈ వన్ స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఎవరైనా మహిళలు ఆపదలో ఉన్నపుడు 181, 100, 112 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమా, డీఎంహెచ్‌వో పి.సరిత, సీడీపీఓలు సుచరిత, క్రాంతి కుమారి, మల్లిక, జయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ ని కార్యాలయంలో కలిసిన

**- వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు**

**పరవాడ మార్చి 8 (ప్రజా ప్రతిభ):**

అనకాపల్లి జిల్లా వై.సి.పి పార్టీ కార్యాలయంలో నూతనంగా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ ని కార్యాలయంలో వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల మరియు పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు సాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గండి రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, మండల ఉప అధ్యక్షులు పైల సత్యనారాయణ బొబ్బిలి భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, మండల యువజన విభాగం అధ్యక్షులు బండారు శ్రవణ్, ప్రచార కమిటీ సభ్యులు పల్లా గోవింద్, మండల కార్యదర్శి గండి సూరిబాబు, బోండా సతీష్, వై.సి.పి నాయకులు పైల అప్పల నాయుడు కావలి వాసు సోము నాయుడు ఉమ మహేశ్వరి ఆశ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**పరవాడ మార్చి 8 (ప్రజా ప్రతిభ):**

పరవాడకేంద్ర బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ కు రూ.60లు, వాణిజ్య సిలిండర్ కు రూ.115లు పెంచడాన్ని సిపిఎం పరవాడ తీవ్రంగా ఖండిస్తూ పరవాడ సంత దగ్గర ఆదివారంపరవాడ అనకాపల్లి రోడ్డుపై నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి, రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై శరాఘాతంగా మారింది. ఈ యుద్ధాన్ని ఖండించి నిలుపుదల చేయించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. ఆ భారాన్ని నేడు ప్రజలపై నెట్టడం ఘోరం. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న సామాన్యులపై వంటగ్యాస్ ధర పెంచి వారి నడ్డి విరవడం అన్యాయం. అలాగే ఉపాధి కోసం తోపుడు బళ్ళు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలతో పొట్ట గడు...

## గిరిజన ప్రాంతల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

**- ఐటిడిఏ కార్యాలయాన్ని పరిశీలించిన సివిల్ సర్వీసెస్ ముస్సోరి డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి**



**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8(ప్రజా ప్రతిభ )**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సర్వీసెస్ ముస్సోరి డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి అధికారులను ఆదేశించారు. ఆదివారం రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి వారిని ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు ఏఎస్పీ హేమంత్, ఐటిడిఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ పుష్పగుచ్ఛాలతో మర్యాదపూర్వకంగా స్వాగతించారు.సమీక్షలో భాగంగా నూతన పోలవరం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై డైరెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని మండలాలు, డివిజన్లు,గ్రామాలు ఉన్నాయో, జిల్లా విస్తీర్ణం ఎంత ఉందో, రహదారి మార్గాల పరిస్థితి ఎలా ఉందో వివరాలు సేకరించారు. జిల్లాలో గిరిజనుల సంఖ్య, వారు సాగు చేసే ప్రధాన పంటలు, పారిశుధ్య కార్యక్రమాల అమలు విధానం వంటి అంశాలపై కూడా అధికారులతో చర్చించారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేశారో, జిల్లాలో ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నాయో కూడా ఆయన ఆరాతీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు ఎలా చేరుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలవరం జల ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌తో పాటు పోలవరం జిల్లాకు సంబంధించిన మ్యాప్‌ను డైరెక్టర్ పరిశీలించారు. అనంతరం పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజల దరఖాస్తులను ఎలా స్వీకరిస్తున్నారో, వాటి పరిష్కార విధానాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏవో ఎర్రం శెట్టిరాజు, మేనేజర్ బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మారేడుమిల్లి ఏ పీ ఓ డి. మణికుమారికి 'బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు'



**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8(ప్రజా ప్రతిభ )**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలవరం జిల్లాలోని మారేడుమిల్లి మండలానికి చెందిన ఏపీఓ డి. మణికుమారి 'బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు' అందుకొని ప్రశంసలు అందుకున్నారు. మహిళల సాధికారత, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత చేతుల మీదుగా ప్రశంసా పత్రం, అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వారు డి. మణికుమారి చేస్తున్న సేవలను అభినందిస్తూ, మహిళల అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతూ, స్వయం సహాయక సంఘాల బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆమె చూపుతున్న చురుకైన పాత్ర ప్రశంసనీయం అని వారు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## అటవీ పరిమితులతో ఉపాధి కష్టాలు చిదూరు గిరిజనుల ఆవేదన

**- కొండపోడు భూముల సమస్యపై ఎస్టీ కమిషన్ చైర్మన్ కి వినతి**



**పోలవరం జిల్లా బ్యూరో :మార్చి 8(ప్రజా ప్రతిభ )**

ఏలూరు జిల్లా పోలవరం మండలం కోరుటూరు పంచాయతీ పరిధిలోని చిదూరు గ్రామానికి చెందిన గిరిజనులు తమ కొండపోడు సాగు భూముల సమస్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన నివాసంలో వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు.చిదూరు గ్రామానికి చెందిన గిరిజనులు పూర్వీకుల కాలం నుండి అటవీ ప్రాంతాల్లో నివసిస్తూ కొండపోడు వ్యవసాయం ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా రాగులు, జొన్నలు, కొర్రలు, పప్పుధాన్యాలు వంటి వర్షాధార పంటలను పండించడంతో పాటు చీకాయ్, చింతపండు, చీపురు, నల్ల జీడిపిక్కలు, తాటి టెంకలు, మామిడి టెంకలు వంటి అటవీ ఉత్పత్తులను సేకరించి జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామస్థుల వివరాల ప్రకారం బ్రిటిష్ పాలన కాలంలోనే 1835 సంవత్సరంలో ఆ గ్రామ గిరిజనులకు కొండపోడు సాగు కోసం సుమారు ఆర్.ఎస్.ఎస్. 20 ఎకరాల భూమి కేటాయించబడిందని తెలిపారు. అప్పటి నుండి ఆ భూముల్లోనే సాగు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.అయితే ఇటీవల అటవీ శాఖ అధికారులు వి.ఎస్.ఎస్ (వన సంరక్షణ సమితి) ఏర్పాటు చేసి కొండపోడు సాగుపై పరిమితులు విధించడంతో గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. కొండపోడు భూములకు ప్రత్యేక సరిహద్దులు నిర్ణయించి వాటిని దాటి సాగు చేయవద్దని హెచ్చరిస్తూ, చేస్తే కేసులు నమోదు చేస్తామని అటవీ అధికారులు భయపెడుతున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిదూరు గ్రామ ప్రజలు ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని చైర్మన్ హామీ ఇచ్చారు.అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని మహిళలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా తెల్లం ఎస్తేరు సత్కారం

**- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రశంస పత్రం**

**- ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా సత్కారం**

**- జీలుగుమిల్లి సెక్టార్‌లో సేవలకు గుర్తింపు**



**జీలుగుమిల్లి, మార్చి 08 (ప్రజా ప్రతిభ):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీలుగుమిల్లి సెక్టార్‌లో సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్ తెల్లం ఎస్తేరు కు ప్రత్యేక గౌరవం లభించింది. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా ఆమెకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.దాట్లవారిగూడెం అంగన్వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తూ చిన్నారుల సంరక్షణ, పోషణ మరియు మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె చూపుతున్న కృషిని గుర్తించి ఈ సత్కారం అందించారు. జీలుగుమిల్లి సెక్టార్ పరిధిలో ఆమె చేస్తున్న సేవలను అధికారులు ప్రశంసించారు.చిన్నారుల ఆరోగ్యం, పోషణ మరియు విద్యా కార్యక్రమాల అమలులో చురుకుగా పనిచేస్తూ అంగన్వాడీ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం ఎస్తేరు ను పలువురు అధికారులు మరియు సహోద్యోగులు అభినందించారు. ఆమె సేవలు ఇతర అంగన్వాడీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.

## శ్రీరంగపట్నం శివాలయం శిఖర ప్రతిష్ట, అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కంబాల

**గోకవరం మార్చి 08 (ప్రజా ప్రతిభ న్యూస్)**

కోరుకొండ మండలం, శ్రీరంగపట్నం గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి శిఖర ప్రతిష్ట, మరియు అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి దర్శించుకుని, అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుని ఘనంగా సత్కరించి, మెమెంటో అందించారు. ఆలయ పునః నిర్మాణానికి లక్ష రూపాయలు, అన్నసమారాధన కార్యక్రమానికి 520 కిలోల బియ్యం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, పెద్దాడ వెంకన్న దొర, నాగరమేష్, వీరాంజలి చింతల కన్నారావు, నెల్లి శ్రీను, తుమ్మల బుజ్జి, వీరబాబు, బుల్లబ్బాయి, నందూరి దుర్గారావు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు..



## మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**వరరామచంద్రపురం మార్చి 8 (ప్రజా ప్రతిభ):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రేఖపల్లి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం నుండి రేఖపల్లి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి విజయ గౌరీ, జిసీడివో కవిత, ఐద్వా రాష్ట్ర నాయకులు రమణి, డాక్టర్ నీలోఫర్ , సీడీపీఓ మల్లిక మాట్లాడుతూ ఆడపిల్లలకు సామాజికంగా సమాన హక్కులు కల్పిస్తూ ఎన్నో చట్టాలు వచ్చాయని గుర్తుచేశారు. అయితే దశాబ్దాలు గడుస్తున్నా మన దేశంలో సామాజిక మరియు సాంస్కృతిక కట్టుబాట్లు మహిళల ఎదుగుదలకు సంకెళ్లుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా శ్రమిస్తున్న మహిళలకు నేటికీ 'రైతు' అనే గుర్తింపు దక్కకపోవడం శోచనీయమన్నారు. రక్షణ కరువైన వేళ ప్రాధాన్యత పెరగాలి.?సమాజంలో మహిళలకు సరైన ప్రాధాన్యత గౌరవం దక్కకపోవడం వల్లే నేటికీ మహిళా రక్షణ అనేది ఒక ప్రశ్నార్థకంగా మారిందని వక్తలు అభిప్రాయపడ్డారు. కేవలం చట్టాల వల్ల మార్పు రాదని, పురుషుల ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చినప్పుడే మహిళలకు నిజమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. నిర్ణయాధికారాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.?డ్రగ్స్ రహిత సమాజం దిశగా అడుగులుప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు బానిసలవుతుండటం పట్ల సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వల్ల అటు యువత భవిష్యత్తు నాశనం అవ్వడమే కాకుండా, ఇంట్లోని మహిళలు శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నారు. డ్రగ్స్ మహమ్మారి నుండి సమాజాన్ని విముక్తి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై మహిళలు చైతన్యవంతులై పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులతో సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.?ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని తమ నిరసనను, ఆకాంక్షలను వ్యక్తం చేశారు.ఈ క్రమంలో ప్రజాప్రతినిధులుఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్ద మట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి,ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ యుటిఎఫ్ నాయకులు సోడి




నాగేశ్వరరావు, నూనె రామకృష్ణ,బాబు, సున్నం చంద్రరావు, పూనం రాజు, నూనె జగదీష్, సిపిఎం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు, మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, గుండెపుడి లక్ష్మణరావు, కమచిచ్చు సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం రంగమ్మ, గొర్రె రాజు, రమాదేవి, నూతన, కనక మహాలక్ష్మి, రాములమ్మ, వరలక్ష్మి శ్రీ వివిధ సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మూరు విద్యుత్ శాఖ జిల్లా స్టోర్‌లో అగ్నిప్రమాదం

**- భారీగా ఎగసిన మంటలు, భయాందోళనలో ప్రజలు**

**రాజమహేంద్రవరం, మార్చి 08 (ప్రజా ప్రతిభ) :**

రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఉన్న విద్యుత్ శాఖ జిల్లా స్టోర్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్టోర్‌లో స్క్రాప్‌గా నిల్వ ఉంచిన పాత విద్యుత్ మీటర్లు ఒక్కసారిగా మంటలు అంటుకుని దహనం కావడంతో భారీగా పొగలు వ్యాపించాయి. మంటలు విపరీతంగా ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తొలుత ఒక ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే మంటలు తీవ్రంగా ఉండటంతో పరిస్థితి అదుపులోకి రాలేదు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడగా, వెంటనే మరో ఐదు ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి.ఈ ఘటన స్థలానికి విద్యుత్ శాఖ ఎస్‌ఈ తిలక్, డీఎఫ్ఓ, డీఈ నక్కపల్లి సామ్యూల్, బొమ్మూరు పోలీస్ స్టేషన్ సీఐ కాశీ విశ్వనాథ్, ఆర్ఐ ప్రసాద్, ఎస్సై రమేష్ తదితర అధికారులు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది చేసిన కృషిని స్థానికులు అభినందించారు.ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు మత్సేటి శివసత్య ప్రసాద్‌తో పాటు నరాలాశెట్టి శ్రీనివాస్, నడిగట్ల కామేష్, దుగ్గిరాల రాజేష్, పలివెల స్వామి, దండంగి సురేష్, జనసేన సాయి, ఇందుగుమిల్లి రవి తదితరులు, పోలీస్, ఫైర్, రెవెన్యూ మరియు విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.



## సీతానగరంలో మావుళ్లమ్మ జాతర వైభవం



**రాజమహేంద్రవరం/సీతానగరం (ప్రజా ప్రతిభ) :**

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం మండల కేంద్రంలో వెలసిన గ్రామ దేవత మాతృశ్రీ మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి నూతనంగా తయారు చేసిన వెండి కవచం, కిరీటం ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని జయజయధ్వానాలతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు సుమారు రూ.10 లక్షల వ్యయంతో తయారు చేయించిన వెండి కవచం, కిరీటాన్ని అమ్మవారికి సమర్పించారు. బొబ్బిలంక గ్రామం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర జాలిముడి, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనగారివారి పేట, ముగళ్ళ, రాపాక, రఘుదేవపురం మీదుగా సీతానగరం వరకు ఘనంగా సాగింది.మార్గమధ్యంలో భక్తులు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికగా మహిళలు మంగళహారతులు పట్టి నీరాజనాలు అర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి వెండి కవచం, కిరీటం అలంకరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావును ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామసేన ప్రతినిధులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కోరుకొండ పీఎంపీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం




**గోకవరం మార్చి 08 (ప్రజా ప్రతిభ న్యూస్)**

కమ్యూనిటి పారామెడిక్స్‌డప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) కోరుకొండ మండలం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైద్యురాలు డాక్టర్ పి విజయలక్ష్మి ఎంబీబీఎస్ ను గౌరవ సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున తనని గౌరవంగా సత్కరించిన పీఎంపీ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంచే వినోద్,కార్యదర్శి సూరిశెట్టి భాస్కర్, కోశాధికారి బిహెచ్ శివకుమార్, అమర శెట్టి ప్రసాద్, తగరంపూడి వెంకటేశ్వరరావు,జోగారావు,వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ లో11న జరిగే వైఎస్ఆర్సిపి రాష్ట్రస్థాయి సమావేశం

**విజయవంతం చేయండి: రాష్ట్ర ఎస్సి సెల్ సెక్రటరీ తోలేటి రాంప్రసాద్**

**గోకవరం మార్చి 08 (ప్రజా ప్రతిభ న్యూస్)**




ఈనెల 11వ తేదీన కాకినాడ సూర్య కళామందిర్ లో వైఎస్ఆర్సిపి ఎస్సి విభాగం రాష్ట్ర స్థాయిలో జరిగే సమావేశం జయప్రదం చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ సెక్రటరీ తోలేట్ రాంప్రసాద్ పిలిపినిచ్చారు. ఈ సందర్భంగా పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబుఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శిలు. జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, వివిధ విభాగాల ఎస్సీ సెల్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం హాయంలో జగన్మోహన్ రెడ్డి ఎస్సీ వర్గానికి పెద్దపీట వేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గాల అభ్యున్నతికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీలు పై దాడులు పెరిగాయని అన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి ఎస్సీ విభాగాల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని రాంప్రసాద్ కోరారు.

## ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**కుప్పం,మార్చి 8(ప్రజా ప్రతిభ) :**

కుప్పం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్.వి గ్రూప్స్ అధినేత బి.యం దయానిధి, డాక్టర్ చిత్ర నాగరాజ్, ఐడిపిఎస్ డైరెక్టర్ బి. లోహిత కృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాలు మరియు కుటుంబ వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ సమాజ పురోగతికి బలమైన పునాది వేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే దేశం మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. మహిళల విద్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన మరియు నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుందని వారు అన్నారు. నేటి మహిళలు విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం వంటి అనేక రంగాల్లో ముందంజలో నిలుస్తూ సమాజ అభివృద్ధికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మహిళల పాత్రపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా సాధికారతపై పలు సందేశాలతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది.



# అంగరంగ వైభవంగా మావుళ్ళమ్మ తల్లి వెండి కవచం ఊరేగింపు...

### - వేలాదిగా తరలివచ్చిన భక్తులు
### - అడుగడుగునా హారతులు పట్టిన మహిళలు

**గోకవరం మార్చి 08 (ప్రజా ప్రతిభ న్యూస్)**

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం గ్రామ దేవత మాతృశ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికివిశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారు 10 లక్షలు రూపాయలు వ్యయంతో తయారు చేయించిన కిరీటంతో కూడిన వెండి కవచంప్రజల దర్శనార్థం ఆదివారం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిందికంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు కార్యక్రమం బొబ్బిలంక గ్రామం నుంచి ప్రారంభమైజాలిముడి కాటవరం మునికూడలి, రాజంపేట వెదుళ్లపల్లి, ఇనగారివారి పేట, ముగళ్ళ,రాపాక రఘుదేవాపురం, సీతానగరం మెయిన్ సెంటర్ మీదగా మావుళ్ళమ్మ అమ్మవారి అలయం వరకు ఘనంగా సాగిందిఊరేగింపుకి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దారి పొడుగునా భక్తులు పూల వర్షం కురిపించారు. ప్రతి గ్రామంలో కూడా మహిళలు హారతులు పట్టి, అమ్మవారి వెండి కవచాన్ని దర్శించుకున్నారుఊరేగింపు అనంతరం ఆలయంలో అమ్మవారిని కంబాల శ్రీనివాసరావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారికి వెండి కవచాన్ని కంబాల శ్రీనివాసరావు గారు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా అలంకరించారుఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావుని ఘనంగా సత్కరించారుఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు



## జె.వి.వి. ఆధ్వర్యంలో భారీ ఎత్తున చీరలు పంపిణీ కార్యక్రమం



**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

ఆదివారం ఉదయం కావలి పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్ నందు కావలి పట్టణ జానవిజ్ఞాన అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పేద మరియు మధ్య తరగతి మహిళలకు చీరలను ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కావలి పట్టణ ప్రముఖ వైద్యులు మరియు జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, వారిని ప్రోత్సహించడం మనందర బాధ్యతని తెలిపారు. అనంతరము అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1908 సంవత్సరంలో న్యూయార్క్ నగరంలో 15000 మహిళా కార్యకర్తలు మెరుగైన వేతనము, పని గంటల తగ్గింపు, ఓటు హక్కు కోసం భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం 1910 సంవత్సరములో కోపెన్ హేగ్ నగరంలో జరిగిన అంతర్జాతీయ మహిళా కార్మికుల సదస్సులో 'క్లారా జెట్కిన్' అనే మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని ప్రతిపాదించినారని తెలియజేశారు. 1911 సంవత్సరంలో మొదటిసారిగా ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ మరియు స్విజ్జర్లాండ్ దేశాలలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అయితే 1975 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి (యు.ఎన్) అధికారికంగా మార్చి 8వ తేదీని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా గుర్తించి ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపడం ప్రారంభించారని తెలియజేశారు. అనంతరము వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళామూర్తులైన జి. కళ్యాణి, ఎస్. స్వర్ణలత, బి. రజని, మొగిలిశెట్టి. జమున లను శాలువ మరియు జెవివి మెమొన్టోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్, అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు, జిల్లా జె వి వి ఉపాధ్యక్షులు పాపిశెట్టి. జానకిరామ్, కావలి పట్టణ జెవివి ఉపాధ్యక్షులు కె. హరినారపరెడ్డి, కార్యదర్శులు రాయపాటి. దిలీప్ కుమార్, గుణకల. శివయ్య, సన్మాన గ్రహీతలు జి. కళ్యాణి, ఎస్. స్వర్ణలత బి. రజని, మొగిలిశెట్టి.జమున, సోమయ్య, భాష, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాతకు అవమానం





**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

బాలాయపల్లి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు ఘోర అవమానం జరిగిన సంఘటన బాలాయపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జయంపు కూడలి పక్కన ఉన్న పాత వెలుగు కార్యాలయం భవనం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో స్థానిక దళితులు అంబేద్కర్ విగ్రమం ఏర్పాటుకు పూనుకుని అంబేద్కర్ విగ్రహం తీసుకువచ్చి పెట్టారు. అదికార పార్టీకి చెందిన ఓ నేత అంబేద్కర్ విగ్రహినికి చోటు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు మట్టి తోలి నిర్మాణాలు చేపట్టారు. ఈక్రమంలో అంబేద్కర్ విగ్రహం కనపించకుండా కంకర, ఇసుకను విగ్రహం ముందు పెద్ద ఎతున తోలారు. దీంతో విగ్రహం కనిపించకుండా పోవడంతో పాటు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కు స్థలం లేకుండా పోయింది. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కొందరు దళితులు స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినా సమస్య ను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు తమకు సంబందంలేదు అన్నట్లు మిన్నకుండిపోయారు. దీంతో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు షుమారు 30 అంకణాల స్థలం లో బారీ స్థాయి నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణాలు బారీగా ఉండడంతో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కు స్థలం లేకుండా పోయి భారత రాజ్యాంగ నిర్మాతకు ఘోర అవమానం చోట చేసుకుంది. భారత రాజ్యాంగ నిర్మాతకు ఇంతటి ఘోర అవమానం చోటుచేసుకున్న అటు రెవెన్యూ, ఇటు పోలీసు శాఖ అదికారులు పట్టించుకోక పోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రాజ్యాంగ నిర్మాతను అవమాన పరిచే విదంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని దళితులు, దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

## చిట్టేడు లో శ్రీ నాగ మానసదేవి విగ్రహ ప్రతిష్ఠ





**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

నెల్లూరు జిల్లా కోట మండలం చిట్టేడు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణం లో శ్రీ నాగమానసా దేవి నూతన విగ్రహ ప్రతిష్ట మరియు హంస వాహనం, బలిపీఠం, శిఖర ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణలు తోయాగం నిర్వహించి అత్యంత వైభవంగా అమ్మవారి గ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాత పలగాటి రేవంత్ రెడ్డి, ధర్మకర్తలుగా కమల చందు, మన్నేటి సుబ్బారావు మరియు శ్రీరామ్ సురేషులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణకర్త పలగాటి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ నాగ మానస దేవి కి దేవాలయం మన ప్రాంతంలో నిర్మించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు అన్నారు. గ్రామ ప్రజలు భక్తుల నడుమ దేవీనామస్మరణలతో ఆలయ ప్రాంగణం, మంగళ వాయిద్యాలు మరియు బాణాసంచా వేడుకలతో ఘనంగా జరిగింది.

## విద్య, వైద్యం, ఉపాధి కోసం మహిళలు ఉద్యమించాలి...

### -మహిళా దినోత్సవ సభలో స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె. అజిత



**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ ):**

పాలకులు విద్యా, వైద్యం,ఉపాధిని గ్యారెంటీ చేసినప్పుడే మహిళలకు కూడా అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుందని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే.అజిత ఉద్ఘటించారు. స్థానిక ఆర్. వ. యం ఉన్నత పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ఎస్.ఝాన్సీ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సభలో అజిత మాట్లాడుతూ శ్రమ దోపిడీకి గురవుతున్న మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు సాగించేందుకు మార్చి 8 స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. 120 సంవత్సరాల క్రితం అమెరికాలో మహిళలు పని పరిస్థితుల మెరుగుదల కోసం సాహసోపేతమైన, కష్టపరితమైన పోరాటాలు సాగించారన్నారు.1910లో డెన్మార్క్ రాజధాని కోపెన్ హెగెన్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా సోషలిస్టు కాన్ఫరెన్స్ లో జర్మనీకి చెందిన సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతిపాదనతో మార్చి 8 మహిళల పోరాట దినంగా నిర్వహించాలని తీర్మానించారని వివరించారు. అనాటి నుంచి అన్ని దేశాలలో మహిళలు సమావేశమై మార్చి 8 విశిష్టతను వివరించుకుంటూ తమ సమస్యలను చర్చించుకుని ఎన్నో పోరాటాలు సాగిస్తూ వచ్చారని తెలిపారు.నేటికీ మన దేశంలో మహిళలు పురుషులతో సమానంగా విద్యా అవకాశాలను పొందలేకపోతున్నారని అన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడలు తెచ్చిన మోడీ ప్రభుత్వం రాత్రి వేళల్లో మహిళలను పనిచేయించుకునేందుకు కార్పొరేట్ కంపెనీలకు అవకాశం కల్పించిందని విమర్శించారు.రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వి. రమణయ్య మాట్లాడుతూ నేడు ఇరాన్ పై ఇటీవల వెనుజులా, పాలస్తీనా దేశాలపై అమెరికా ఇజ్రాయిల్ ను కలిసి సాగించిన దురాక్రమణ యుద్ధాలతో ప్రపంచ ప్రజలందరికీ నష్టదాయకమన్నారు. ఆయా దేశాలకే గాక మిగిలిన దేశాల ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ యుద్ధాల సమయంలోనే కేంద్ర ప్రభుత్వం రెండు దఫాలు గ్యాస్ సిలిండర్ ధర పెంచిందని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి సామాన్యులపై భారం పడుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ యుద్ధాన్ని ఖండించాలన్నారు. పి.డి.ఎస్.ఓ ఏరియా కన్వీనర్ సిహెచ్ పవన్ మాట్లాడుతూ మహిళలపై, విద్యార్థినులపై లైంగిక దాడులు రోజు రోజుకి పెచ్చిమీరుతున్నాయన్నారు. మద్యం, గంజాయి అమ్మకాలను ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేశారు. టీవీ కార్యక్రమాలు, సీరియళ్లు, సినిమాలు, పోర్న్ వీడియోల ప్రభావం విద్యార్థి యువతరంపై ఎక్కువగా ఉందని వీటికి దూరంగా యువత ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు కృష్ణప్రియ, అనుపమ మహిళలు పాల్గొన్నారు.

## కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**కొవ్వూరు, మార్చి 08 (ప్రజా ప్రతిభ) :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్టేషన్ ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా పోలీసు సిబ్బందిని సత్కరించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేసి ఉత్సాహంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం ఉమెన్ కానిస్టేబుల్స్ ఉషా, పద్మ, సీతా, శైలజ, ఉషా లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.అలాగే చిన్నారి బుడితి స్వేచ్ఛ స్వాభిమాన్‌ను ఎస్సై శ్రీహరి శాలువా కప్పి ప్రత్యేకంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీహరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళల ధైర్యం, సేవాభావం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. చిన్నారులు కూడా విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ రైటర్ భగవాన్ దాస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బత్తుల



**రాజానగరం మార్చి 08 (ప్రజా ప్రతిభ న్యూస్)**

రాజానగరం నియోజకవర్గ మధురపూడి విమానాశ్రయం నందు ఎయిర్పోర్ట్ అధికారులు, పోలీస్ డిపార్ట్మెంట్ వారు ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజానగరం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ మరియు వారి సతీమణి బత్తుల వెంకటలక్ష్మి ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ పూర్వం వంటింటికి మాత్రమే పరిమితమైన మహిళలు నేడు ప్రపంచాన్ని శాసిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ మగవాళ్ళతో సమానంగా పురుషుల కన్నా ఎన్నో రెట్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ఆడవాళ్లు అబలలు కాదు సబలలు అని నిరూపిస్తున్నారు. ప్రతి మగవాడి విజయం వెనుక ఒక ఆడది ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. నేటి ఆధునిక యుగంలో చట్టసభల్లో మహిళలు తమ ప్రాతినిధ్యాన్ని సమర్థవంతంగా నిరూపించుకోవడమే కాదు దేశ అభివృద్ధి లోనూ కీలకంగా ముందుకు సాగుతున్నారు ఆకాశమంత సమున్నత వ్యక్తిత్వంతోరాజ్యాంగబద్ధమైన వ్యవస్థలలోనూ బలమైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారుఉన్నత విద్యావంతులుగా శాస్త్రవేత్తలుగ న్యాయమూర్తులుగా, ఇంకా న్యాయవాదులుగా, దేశాన్ని పరిపాలించే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, ఎయిర్ వేస్ లో అధికారులుగా పైలెట్లుగా తమదైన ముద్ర వేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అన్నింటికన్నా కీలకమైన ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన పార్లమెంటులోనూ, రాష్ట్రాల అసెంబ్లీలలోనూ మహిళలు.. పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవలు అందించడం.. ఈ శతాబ్దపు చరిత్రలో అద్భుతమైన విజయం ఈ సందర్భంగా ప్రపంచ మహిళలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదా లు తెలుపుతూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు విమానాశ్రయ అధికారులు ఇతర సిబ్బంది జనసేన నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పాల్గొనడం జరిగింది.


## కుప్పంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కుప్పం, మార్చి 8(ప్రజా ప్రతిభ):**

కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కుప్పం ఎం.ఎఫ్.సి ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, పి.కె.ఎం పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల కోసం మ్యూజికల్ చెయర్స్ వంటి పలు క్రీడా పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ఉత్తమ మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాజెక్టు డైరెక్టర్ అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఫ్రంటియర్ మార్కెట్, మైన్ మహిళ, పురే, ఎజిమార్ట్ వంటి సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను అతిథులు సందర్శించి మహిళా వ్యాపారులను ప్రోత్సహించారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కుప్పం నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా అవ్వారు సత్యనారాయణ



**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ):**

అఖిల భారత పద్మశాలీయ సంఘ అధ్యక్షులు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర పద్మశాలియ సంక్షేమ సంఘం రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా చేనేత నాయకులు అవ్వారు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంకు చెందిన చేనేత కళాకారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా అవ్వారు సత్య నారాయణ మాట్లాడుతూ చేనేత కళాకారుల అభ్యున్నతికి, వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఈ పదవి ఒక బాధ్యతగా, సాయం చేసేందుకు అవకాశంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# అంగరంగ వైభవంగా కొండ బిట్రగుంటలో శ్రీవారి తెప్పోత్సవం

**- భారీగా పాల్గొన్న భక్తులు**

**- ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి**



**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

నెల్లూరు జిల్లా, బోగోలు మండలం కొండ బిట్రగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతనంగా నిర్మించిన కోనేరులో తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన కోనేరులో స్వామివారిని తెప్పపై ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు,వేద పండితులు తెప్పోత్సవాన్ని భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.

# లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ





**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ ):**

వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని వివిధ వార్డులలో ఆరోగ్య సమస్యలతో అధిక వైద్య ఖర్చులు చేసిన లబ్ధిదారులకు ఆదివారం ఇంటింటికి వెళ్లి ఆయన చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారి ఆరోగ్య సమస్యలపై ఆయన ఆరా తీశారు. ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకు ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ. యం. సి చైర్మన్ మురుగ, మాజీ పట్టణ అధ్యక్షులు మంకు ఆనంద్, టీడీపీ నాయకులు మల్లారం బాబు, మస్తాన్ బాషా,నూకల శ్రీను,నరసింహులు, రమణయ్య,యారాసి శ్రీనివాసులు,నాగార్జున, వీరయ్య,పలువురు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం రోజు మహిళకు న్యాయం చేసిన నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**- కలెక్టరే దేవుడు అంటున్న మహిళ**

**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**




నెల్లూరు జిల్లా బుచ్చిలో వడ్డీల పేరుతో విజయ కుమారి ఇంటిని అన్యాక్రాంతం చేసుకుని ఇంటి నుండి వెళ్లగొట్టిన లెల్లయ్య అనే వ్యక్తి.తన అవసరాల నిమిత్తం 70,000 రూపాయలు తీసుకుని తిరిగి అసలు వడ్డీ లక్షల్లో చెల్లించినా మళ్ళీ 50వేల రూపాయలు ఇవ్వాలని వేధిస్తూ విజయకుమారి ఇంటిని ఆక్రమించుకున్న లెల్లయ్య.ఎన్నో చోట్ల తిరిగినా జరగని న్యాయం,చివరికి పి జి ఆర్ ఎస్ లో జిల్లా కలెక్టర్ ను కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి తెలిపిన విజయ కుమారి,చలించిపోయిన కలెక్టర్ వెంకటనే స్పందించి బుచ్చి మున్సిపల్ కమిషనర్ ను విచారణ చేయాలని ఆదేశించారు.

బుచ్చి లో విచారణ జరిపిన కమిషనర్,విజయకుమారి చెప్పింది వాస్తవమని కలెక్టర్ కు నివేదిక,వెంటనే లెల్లయ్య వద్ద నుండి ఇంటిని స్వాధీనం చేసుకుని విజయకుమారికి అప్పచెప్పాలని కమిషనర్ ను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల.న్యాయం కోసం ఎక్కని మెట్టు లేదు తొక్కని గడపా లేదు ఇక తనకు న్యాయం జరగదని వున్న ఒక్కగానొక్క తన ప్రాణప్రదమైన ఇల్లు కూడా దూరమైందని ఎంతో నిర్వేదం లో వున్న విజయకుమారి చివరి ఆశగా జిల్లా కలెక్టర్ ను కలవడం కలెక్టర్ వెంటనే స్పందించి తన సమస్య పరిష్కరించి తన ఇంటిని తనకు అప్పగించడం దేవుడే కలెక్టర్ రూపం లో తనకు న్యాయం చేశారని విజయకుమారి ఆనంద బాష్పాలు.వివరాలు చూసుకుంటేనెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పేరం విజయకుమారి అనే మహిళ గత కొన్ని నెలలుగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆమె తల్లి--తండ్రులు తన తమ్ముడి పెళ్లి కోసం నక్క లెల్లయ్య వద్ద రూ.70,000 అప్పుగా తీసుకున్నారు. అయితే ఆ అప్పు తీర్చకముందే వారు మరణించారు. అనంతరం లెల్లయ్య అసలు 70వేలకు అదనంగా మరో రూ.2,30,000 రూపాయలు కలిపి మొత్తం రూ.3,00,000లు తీసుకున్నట్టు గా బలవంతంగా విజయకుమారి వద్ద పత్రం రాయించుకున్నారు.మూడు రూపాయలు వడ్డీ చొప్పున నెలకు 9,000 వడ్డీగా మూడు సంవత్సరాల పాటు ఆమె చెల్లించారు. కాలక్రమంలో వడ్డీతో కలిపి మొత్తం రూ.3 లక్షలు చెల్లించినప్పటికీ, ఇంకా రూ.50,000 ఇవ్వాలని చెప్పి ఇంటి పత్రాలు తిరిగి ఇవ్వకుండా లెల్లయ్య ఆ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తనను పిల్లలను తన ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టేశారని రోడ్డున పడ్డ విజయకుమారి తన పిల్లలతో కలిసి నాలుగు నెలల పాటు అద్దె ఇళ్లు తీసుకుని అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ, బంధువుల ఇళ్లలో తలదాచుకుంటూ జీవనం సాగించారు. చివరికి న్యాయం కోసం ఆమె జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లో కలిసి తనకు జరిగిన అన్యాయం పై అర్జీ సమర్పించారు. తన ఇంటిని తిరిగి ఇప్పించాలంటూ ఆమె కన్నీటి పర్యంతం అవడం తో జిల్లా కలెక్టర్ శుక్లా చలించి పోయారు,విషయాన్ని పరిశీలించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా వెంటనే స్పందించి, బుచ్చిరెడ్డిపాలెం పురపాలక సంఘ కమిషనర్‌కు ఈ నెల 7వ తేదీన విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే విచారణ చేపట్టిన అధికారులు పరిస్థితిని పరిశీలించి, నక్క యానదయ్య ఆక్రమణలో ఉన్న ఇంటిని విడిపించి, అసలు యజమాని అయిన విజయకుమారికి మహిళా దినోత్సవం అయిన ఈ రోజు ఆమెకు అప్పగించారు.దీంతో నాలుగు నెలలుగా ఇల్లు లేక,రోడ్ల మీద తిరుగుతూ,బంధువుల ఇళ్లలో తలదాచుకుంటూ ఎన్నో ఇబ్బందులు పడిన విజయకుమారి తన ఇల్లు తిరిగి తనకు స్వాధీనం కావడం తో విజయకుమారి ఆనందానికి అవధులు లేవు,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చొరవతో తనకు "నాకు న్యాయం జరిగిందనీ ఈ రోజు నా పిల్లలతో మళ్లీ నా ఇంట్లో ఉండగలుగుతున్నాను. కలెక్టర్ గారికి జీవితాంతం కృతజ్ఞురాలిని" ఆ దేవుడు కలెక్టర్ రూపం లో తమకు కనిపించాడని విజయకుమారి భావోద్వేగంగా స్పందించారు.కలెక్టర్ హిమాన్షు శుక్ల పనితీరు పై జిల్లా ప్రజలు హర్షం.ఈ ఘటన ద్వారా బాధితుల సమస్యలపై సత్వర స్పందనతో చర్యలు తీసుకుంటే ప్రజలకు న్యాయం త్వరగా అందుతుందని మరోసారి రుజువైంది. జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యల పట్ల సానుభూతితో వెంటనే స్పందిస్తున్నారని జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు.నెల్లూరు జిల్లా లో అప్పులు అధిక వడ్డీల పేరుతో ప్రజలను వేధిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు అన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల.అప్పుల పేరుతో అమానుష వేధింపులకు చెక్ -- వడ్డీ వ్యాపారులకు విజయకుమారి ఉదంతం ఓ గట్టి హెచ్చరిక.అప్పుల వ్యాపారం పేరుతో ప్రజలను వేధించడం, అధిక వడ్డీలు వసూలు చేయడం, బలవంతంగా పత్రాలపై సంతకాలు తీసుకోవడం వంటి అమానుష చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. అప్పు ఇచ్చిన పేరుతో పేద ప్రజలను మానసికంగా, శారీరకంగా వేధించడం, వారి ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన గట్టిగా హెచ్చరించారు.అలాగే, ఇది ఒక్క వ్యక్తికి సంబంధించిన సమస్య మాత్రమే కాకుండా సమాజంలో చాలాచోట్ల కనిపిస్తున్న తీవ్రమైన సమస్య అని ఆయన తెలిపారు.అప్పుల పేరుతో ప్రజలను భయపెట్టి, అవమానపరచి, ఇళ్ల నుంచి వెళ్లగొట్టడం వంటి అమానుష చర్యలకు పాల్పడే వారందరికీ ఇది గట్టి హెచ్చరికగా భావించాలని పేర్కొన్నారు. ప్రజలను వేధిస్తూ అన్యాయంగా వ్యవహరించే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు.

# మహిళల శక్తితోనే సమాజ అభివృద్ధి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ...

**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ ):**



ఒక కుటుంబానికి పునాది మహిళ అయితే... సమాజానికి వెన్నెముక మహిళా శక్తి" అని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.ఆదివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరిచుకుని వెంకటగిరి పట్టణములోని ఎస్. ఆర్. ఎల్ కళ్యాణమండపంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ మహిళలకు స్థానిక నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తల్లులు, అక్కచెల్లెమ్మలు, కుమార్తెలుగా కుటుంబాన్ని నిలబెట్టే మహిళలే సమాజ అభివృద్ధికి అసలైన బలం అని పేర్కొన్నారు.వెంకటగిరి నేతన్నల ఖ్యాతి దేశ విదేశాలకు విస్తరించడంలో మహిళల కృషి గొప్పదని ఎమ్మెల్యే రామకృష్ణ కొనియాడారు. మగ్గంపై పోగులు తీయడం నుంచి అద్భుతమైన డిజైన్లతో చీరలను తయారు చేసే వరకు మహిళలు పడుతున్న శ్రమకు తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందన్నారు. నేత పరిశ్రమలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమని కొనియాడారు.మహిళా సాధికారతకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి వేదికగా మహిళల కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించారని పేర్కొన్నారు.ఆడపిల్లల ఉన్నత విద్యకు ప్రోత్సాహం కల్పించేందుకు "ఎన్టీఆర్ విద్యాలక్ష్మి" పథకం ద్వారా ఒక్కో విద్యార్థినికి రూ.1 లక్ష వరకు పావలా వడ్డీతో రుణం అందిస్తున్న్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు "ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి" పథకం కింద దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.డ్వాక్రా మహిళల కార్యకలాపాల్లో పారదర్శకత పెంచేందుకు యానిమేటర్లకు రూ.15 వేల విలువైన స్మార్ట్‌ఫోన్లు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించే ఉద్దేశంతో ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలు ఇప్పటికే అమలులో ఉన్నాయని తెలిపారు. కొత్తగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

వెంకటగిరి అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.వెంకటగిరి చీరల మార్కెటింగ్‌ను ఈ-కామర్స్ వేదికల ద్వారా విస్తరించి మహిళా పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.అలాగే మహిళల విద్య, ఉపాధి కోసం ప్రతి మూడు నెలలుకు ఒకసారి మాదిరే ఈ మార్చి 9న వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు."మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు... ఆమె తన నిర్ణయాలను తానే తీసుకునే స్థాయికి చేరడం" అని పేర్కొంటూ, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి మహిళకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల పాత్రను గుర్తుచేసుకుంటూ, సమాజ అభివృద్ధిలో వారి భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.అదే విధంగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన మహిళ పారిశుధ్య కార్మికులు మెప్మా, వెలుగు, అంగన్వాడీ, పార్టీ నాయకురాళ్లుకు, మహిళా జడ్పీటీసీ, మహిళ ఎంపీపీలకు , మహిళా ఎఏ. యం. సి ఛైర్మెన్ లకు శాలవాలతో మొమోటోలు ఇచ్చి ఘనముగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఉమ్మడి నెల్లూరు జిల్లా డి. సి. యం. ఎస్ ఛైర్మెన్ గంగోటి నాగేశ్వరరావు,బిజెపి నియోజకవర్గం ఇంచార్జి యస్. యస్. ఆర్ నాయుడు,నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్ రావు, వెంకటగిరి ఏ. యం. సి ఛైర్మన్ మురుగ , మాజీ ఏ. యం. సి ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు , వెంకటగిరి ఎంపీపీ, రాపూరు జడ్పీటీసీ, ఎంపీపీ, ఏపీఎంలు, కమిషనర్, ఎంపీడీఓ లు విద్యార్థినిలు, మహిళలు తదితరులు పొల్గోన్నారు.

# జెడ్ పీ హై స్కూల్‌లో ప్యాడు పెన్సిల్ పెన్నులు వితరణ

**- రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీ మోమిడి మల్లికార్జున.**



**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

బిట్రగుంట రైల్వే ఇనిస్ట్యూట్ సెక్రటరీ మోమిడి మల్లికార్జునరావు మాట్లాడుతూ బిట్రగుంట జడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ ఇవ్వడం జరిగినది మల్లికార్జున విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల పైన అవగాహన కలిగిస్తూ బాగా చదివి బాగా ఎగ్జామ్స్ రాసి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆయన మంచి మంచి సలహాలను ఆయన సూచించారు. బి ఎం ఆర్ యువసేన అధ్యక్షుడు సమీవుల్లా మాట్లాడుతూ మల్లికార్జున ఇక్కడే కాదు ఈ సంవత్సరం ఆయన చదువుకున్న స్కూల్లో మరియు కొన్ని పాఠశాలలో ఎగ్జామ్స్ కిట్ ప్యాడ్స్ పెన్సిల్స్ ఇవ్వడం జరిగింది మల్లికార్జున రావు కి ధన్యవాదములు తెలిపారు మరియు కార్యక్రమంలో జడ్పీ బాయ్స్ హెచ్ఎం ఎ బి నిరజ మరియు బాయ్స్ హెచ్ ఎం జి గంగాధరం అమీర్ హుస్సేన్ డబ్బరు శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవో తీరును నిరసిస్తూ మండల సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్, ఎంపీటీసీ




**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

జలదంకి ఎంపీడీవో భాస్కర్ తీరును నిరసిస్తూ కేశవరం పంచాయతీ సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు, వైస్ ఎంపీపీ మేకల దనమ్మలు మండల సమావేశం నుంచి బయటకు వచ్చేసారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యత అంటూ మండల సమావేశం మొదలుపెట్టిన ఎంపీపీ ఎంపీడీవోలు తాగునీటి కొండపై సర్పంచి రావిప్రసాద్ వివరణ కోరితే కూర్చో అంటూ ఎంపీడీవో అనుచితంగా ప్రవర్తించారు. కమ్యూనిటీ హాల్ ని అంగన్వాడికి కేటాయించాలని కలెక్టర్ ఆదేశించిన పట్టించుకోవడంలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు, సర్వే నంబర్ 8లో 5 ఎకరాల సెంట్లు పాటి కుంటను చదును చేసి జామాయిల్ మొక్కలు నాటుకున్నారని, ఈ కుంటలో గతంలోనూ ఉపాధి హామీ పనులు నిర్వహించారని వెంటనే చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. సమాధానం చెప్పలేక ఎంపీడీవో అసహనం వ్యక్తం చేయడమే కాక, సర్పంచ్ రావు ప్రసాద్ ని కూర్చో కూర్చో అంటూ మాట్లాడడంతో మనస్థాపానికి గురైన ప్రసాద్ నాయుడు కనీసం సర్పంచుకు మాట్లాడే అవకాశం ఇవ్వరా అంటూ సభ నుంచి బయటకు వచ్చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని న్యాయం జరిగేంత వరకు ఆగేది లేదన్నారు.

# రక్తదానం పట్ల అవగాహన కలిగి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి





**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

రక్తదానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి రక్తదాత కావాలని. కోట ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి శివకుమార్ అన్నారు.ఆదివారం కోట మండలం చెందోడు గ్రామంలోని ఎం వి రావు ఫౌండేషన్ కార్యాలయంలో స్వర్గీయ ముప్పవరపు ఆదిలక్ష్మి ఆమె మరణించిన తేదీని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజల్వన చేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా పి శివకుమార్ ముందుగా 78వ సారి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతల నుంచి మెడిపల్స్ ఇంచార్జ్ ఎం. సురేష్ బాబు నేతృత్వంలో రక్త దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తన 25 నుంచి 78 సార్లు రక్తదానం చేశానని, అదేవిధంగా ఎన్.ఎస్.ఎస్, ఎన్ సి సి లో కళాశాల రోజుల నుంచి సి సర్టిఫికేట్ తో పాటు ఐ క్యాంపులు రక్తదాన శిబిరంలో ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టానని ఈ క్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ అనునిత్యం చేస్తున్న సేవా కార్యక్రమాలు తనకు ఎంతగానో నచ్చాయని అందుకే తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాతలను గ్రామీణ ప్రాంత ప్రజలను ప్రోత్సహించే నిమిత్తం ఇక్కడే రక్తదానం చేస్తున్నట్లు ఆపదలో వారిని రక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం రక్తదాతల నుంచి గూడూరు పట్టణానికి చెందిన మెడిపల్స్ రక్తనిధి కేంద్రం నిర్వాహకులు రక్తదాతలు నుంచి రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో ఎం. వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, మెడికల్ కేంద్రం టెక్నీషియన్స్, మహిళలు రక్తదాతలు పాల్గొన్నారు.

## సమాజం అభివృద్ధిలో

# మహిళల పాత్ర కీలకం



**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గూడూరులో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కుంచం దయాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన కుంచం దయాకర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కుటుంబ నిర్మాణం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.మహిళలకు సమాన హక్కులు, గౌరవం మరియు అవకాశాలు కల్పించేందుకు కేంద్రంలో,రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, విద్యా అభివృద్ధి మరియు భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళలు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి మరింతగా తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల శక్తి దేశ అభివృద్ధికి ప్రధాన బలమని, మహిళల సాధికారతే దేశ పురోగతికి మార్గమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలు హక్కుల కోసం పోరాడాలి: వేమేశ్వరీ

**పలమనేరు మార్చి 8( ప్రజా ప్రతిభ)**

మహిళలు హక్కుల కోసం పోరాడాలని పోరం ఫర్ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమేశ్వరి పిలుపుని చ్చారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలమనేరు పట్టణములో ఆ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సంస్కృతి అధ్యక్షతన ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇంకా పురుషాధిపత్యం కొనసాగుతున్నదని ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలకు ఇంకా స్వేచ్ఛ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగినప్పుడే మహిళలకు హక్కులు వచ్చినట్టని గుర్తు చేశారు. దేశం రాష్ట్రాల్లో ఇప్పటికీ మహిళలు పైన, చిన్నారుల పైన అఘాయిత్యాలు జరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినంత చలనం లేకపోవడం బాధాకరమన్నారు. ఆ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డి.వి. మునిరత్నం ఎక్కడైనా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే కులాలు మతాలుకు అతీథంగా న్యాయం జరిగే వరకు పోరాడాల్సింది ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిలకమ్మా, నాగరత్న, మణి, అరుణ, రత్నమ్మ, ప్రభుజ్యోతి, గౌరీ, మహిళలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో

# పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్





**నెల్లూరు బ్యూరో మార్చి 08(ప్రజా ప్రతిభ):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వింజమూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలందరికీ హృదయపూర్వక అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవాన్ని ఒక ప్రత్యేకమైన థీమ్‌తో ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ సంవత్సరం “గివ్ టు గైన్” అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధికి మూలస్థంభమని, మహిళలు బలంగా ఉంటే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలంగా ఉంటే సమాజం మరింత బలంగా మారుతుందని అన్నారు. సమాజం బలంగా ఉంటే దేశం మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.మహిళలకు గౌరవం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధించగలదని ఆయన పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తూ అద్భుతమైన విజయాలను సాధిస్తున్నారని అన్నారు.మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల సంక్షేమానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా వారందరికీ “తల్లికి వందనం” పథకం ద్వారా తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు.అదేవిధంగా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిదేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచీ ఒక మహిళను పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రతి నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.వింజమూరులో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, అధికారులు మరియు మహిళా నాయకులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళలు మరింత ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ, సోదరీమణులందరికీ మరోసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేదురుమల్లి ఆధ్వర్యంలో

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు...





**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ ):**

వెంకటగిరి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నేదురుమల్లి నివాసం ఎన్.జే. ఆర్ భవన్లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, వెంకటగిరి మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు, మహిళ ఎంపీటీసీలు, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలు రామతులసి లను నేదురుమల్లి శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కోడూరు కల్పలత మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మహిళల సాధికారత, సమాజ నిర్మాణంలో వారి పాత్రను గుర్తించి స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని మహిళలకే దక్కేలా చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. అనంతరం మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కటింగ్ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని నాయకులు ఆకాంక్షించారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ళు మహోత్సవం...

**- ప్రత్యేక అలంకరణలో శ్రీ అంకమ్మ తల్లి...**

**- సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం..**





**వెంకటగిరి, మార్చి 8(ప్రజా ప్రతిభ ):**

వెంకటగిరి పట్టణం ఆనందపురంలోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ళు మహోత్సవం శుక్రవారం నుండి ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీ అంకమ్మ తల్లి గ్రామోత్సవము రంగు రంగుల విద్యుత్ దీప కాంతులు ,ప్రత్యేక పూల అలంకరణతో, మంగళ వాయిద్యం, బాణాసంచాలతో భక్త జన సందోహముతో పట్టణ పురవీధులలో వైభవంగా జరిగింది.ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పొంగళ్ళ కార్యక్రమం జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించి వారి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ భక్త బృందం తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

## సమ్మర్‌లో ఏసీ షాక్..

**ధరలు పెంచేస్తున్న కంపెనీలు**



**న్యూఢిల్లీ:** ఈ వేసవికి ఏసీ కొనాలనుకుంటున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్. ముడి పదార్థాల ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఏసీ తయారీ కంపెనీలు ధరలు పెంపునకు సిద్ధమవుతున్నాయి. రవాణా ఖర్చులు, కొత్త ఇంధన వినియోగ నిబంధనలు కూడా పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలు పెంచగా.. మరికొన్ని పెంపునకు సిద్ధమవుతున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హైయర్, మిత్సుబిషి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి.

ప్రముఖ ఏసీల తయారీ కంపెనీ డైకిన్ తన ఏసీ ధరలను 12 శాతం వరకు పెంచనుంది. మోడల్‌ను బట్టి ఏప్రిల్ నుంచి ఈ పెంపు ఉండబోతోందని డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా పేర్కొన్నారు. ఏసీల తయారీలో వినియోగించే రాగి వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో పాటు, కొత్త ఇంధన నిబంధనల వల్ల ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల వల్ల సరకు రవాణా ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయం లేక ఏసీ ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి ఏసీ కంపెనీదీ ఇదే పరిస్థితి అని వివరించారు. ఈ ఏడాది ఏసీల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు.

### సుందర్ పిచాయ్ వేతనం రూ.6,350 కోట్లకు!

**బ్లూస్టార్ ఇది వరకే:** మరో ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఫిబ్రవరి మధ్యలోనే ఏసీ ధరలను 8-10 శాతం పెంచేసింది. అయితే పాత ధరల ఇన్వెంటరీ ఇప్పటికీ మార్కెట్లో ఉన్నందువల్ల రేటులో పెద్దగా తేడా ఉండబోదని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. ఏసీల ధరల పెరుగుదల ఊహించి డీలర్లు ముందుగానే స్టాక్ పెట్టుకుని, వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్‌పై మాత్రం ధరల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ సైతం 5-15 శాతం మేర ఏసీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. గడిచిన కొన్ని నెలలుగా రాగి ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం అవ్వడం వంటి కారణాలతో రేట్లు పెంచాల్సి వస్తోందని వోల్టాస్ ఎండీ ముకందన్ మేనన్ పేర్కొన్నారు. దీంతో పాటు ఎల్‌జీ సంస్థ 3 స్టార్ ఏసీలపై 7 శాతం, 5 స్టార్ మోడళ్లపై 9-10 శాతం చొప్పున ధరల పెంచుతున్నట్లు వెల్లడించింది. హైయర్ ఇండియా సైతం 5-8 శాతం మధ్య ధరలు పెంచబోతోందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ సతీష్ పేర్కొన్నారు. మిత్సుబిషి ఏసీ ధరలు 5 శాతం మేర పెరగనున్నాయని ఆ కంపెనీ పేర్కొంది.

**2026పైనే ఆశలు:** ఏసీ తయారీ కంపెనీలన్నీ దాదాపు ఈ ఏడాది విక్రయాలపై పెద్దగానే ఆశలు పెట్టుకున్నాయి. గతేడాది వీటి విక్రయాలు మందగించడమే ఇందుకు కారణం. అకాల వర్షాలు, ఇతర అంశాలు వీటి విక్రయాలపై ప్రభావం చూపాయి. 2024లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, ఉక్కపోత కారణంగా రికార్డు స్థాయిలో ఏసీల విక్రయాలు నమోదయ్యాయి. మళ్లీ ఆ స్థాయిలో విక్రయాలను ఈ ఏడాది ఉంటాయని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.


## వార్ ఎఫెక్ట్.. 4 రోజుల్లో రూ.21 వేల కోట్లు ఎఫ్‌పీఐయులు బయటకు



**న్యూఢిల్లీ:** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ దాడులు దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరిలో రూ.22,615 కోట్ల విలువైన పెట్టుబడులను విక్రయించారు. గత 17 నెలల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. మార్చి 2 నుంచి 6వ తేదీల మధ్య రూ.21 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం మార్కెట్‌పై పడిందని నిపుణులు చెబుతున్నారు.

ముడి చమురు, గ్యాస్ రవాణాకు కేంద్ర బిందువైన హర్మూజ్ జలసంధి చుట్టూ నెలకొన్న అడ్డంకులు, బ్రెంట్ ముడి చమురు ధర 90 డాలర్లకు చేరడం ప్రపంచ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని సీనియర్ నిపుణుడు వకార్ జావేద్ ఖాన్ తెలిపారు. రూపాయి విలువ పతనమవడం అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడం పెట్టుబడులు తరలిపోవడానికి మరో కారణమన్నారు. దీనికితోడు ఐటీ, వినియోగ రంగాలపై ఒత్తిళ్ల కారణంగా క్యూ4 త్రైమాసిక ఫలితాలపై మిశ్రమ అంచనాలు నెలకొన్నాయన్నారు. బ్రెంట్ క్రూడ్ ధర పెరగడం భారతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారిందని మరో అనలిస్ట్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో విదేశీ మదుపర్లు సురక్షితమైన పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నారని తెలిపారు. ఓ వైపు ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగుతున్నా.. డొమెస్టిక్ ఇన్వెస్టర్లు మాత్రం ఈక్విటీ మార్కెట్‌కు దన్నుగా నిలుస్తున్నారు.

## రూ.లక్ష కోట్ల వ్యవసాయ ఎగుమతుల సంగతేంటి?



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ప్రాంతంలోని ఉద్రిక్తతల వల్ల భారత వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై గణనీయ ప్రభావం పడనుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ అభిప్రాయపడింది. 2025లో భారత్ నుంచి ఈ ప్రాంతానికి 11.8 బిలియన్ డాలర్ల విలువైన (సుమారు రూ.1 లక్ష కోట్లు) వ్యవసాయ, ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయిన విషయాన్ని గుర్తు చేసింది. ఇప్పుడీ ఉద్రిక్తతలతో ఈ మేరకు విలువైన ఎగుమతులు ఇబ్బందుల్లో పడొచ్చని తెలిపింది. నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాలు, బీమా వ్యయాలు పెరగడం, సరఫరాపరంగా అనిశ్చితులు నెలకొనడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. 'భౌగోళికపరమైన సారూప్యత ఉండటం, భారతీయులు అక్కడ పెద్ద సంఖ్యలో నివసిస్తుండటంతో సహజంగానే భారత ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు గల్ఫ్ ప్రాంతం కీలకంగా మారింది. కొన్ని దశాబ్దాలుగా గల్ఫ్ మార్కెట్లపై భారత వ్యవసాయ ఎగుమతులు ఆధారపడటం పెరుగుతూ వచ్చింది. తాజా పరిణామాలతో భారత్ నుంచి ఈ తరహా ఉత్పత్తుల ఎగుమతులకు సంక్షోభ పరిస్థితి ఏర్పడింద'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.

### తెలంగాణ, ఏపీ రైతులపై ప్రభావం..

బియ్యం ఎగుమతులపై అధిక ప్రభావం పడొచ్చు. గతేడాది పశ్చిమాసియా ప్రాంతానికి భారత్ 4.43 బిలియన్ డాలర్ల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేసింది. భారత్ మొత్తం బియ్యం ఎగుమతుల్లో పశ్చిమాసియా దేశాల వాటానే 36.7 శాతం. ముఖ్యంగా పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి గల్ఫ్ మార్కెట్లకు అధికంగా బియ్యం ఎగుమతి అవుతున్నాయి. తాజా పరిణామాలతో ఈ రాష్ట్రాల్లోని రైతులపై నేరుగా ప్రభావం పడనుందని శ్రీవాస్తవ తెలిపారు.



# వరల్డ్ ఛాంపియన్ భారత్..

**టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర..**

**న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ**

**2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్**

**పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు**

**ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం**

**బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన**

**అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్**





**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది.

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

## టీ20 ఫైనల్ ముందు తారల సందడి..

**రికీ మార్టిన్, ఫల్గుణి పాఠక్, సుఖ్ బీర్ ప్రదర్శనలతో హోరెత్తిన స్టేడియం**

**టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ముందు ఘనంగా ముగింపు వేడుకలు**


**ఆట ముందు పాటల హోరు.. టీ20 ఫైనల్ వేడుకల్లో స్టార్ సింగర్ల హంగామా**

**ఫల్గుణి పాఠక్, సుఖ్ బీర్, రికీ మార్టిన్ ప్రదర్శనలతో హోరెత్తిన స్టేడియం**



**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఆదివారం టీ20 ప్రపంచ కప్ 2026 ఫైనల్ సమరానికి ముందు సంగీత ప్రదర్శనలతో దద్దరిల్లింది. భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు నిర్వహించిన ముగింపు వేడుకల్లో ప్రఖ్యాత గాయకులు ఫల్గుణి పాఠక్, సుఖ్ బీర్ సింగ్, అంతర్జాతీయ స్టార్ రికీ మార్టిన్ తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. లక్షలాది మంది అభిమానులతో కిక్కిరిసిన ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం వీరి పాటలతో హోరెత్తింది. ముఖ్యంగా, 'దాండియా క్వీన్' ఫల్గుణి పాఠక్ తన ఐకానిక్ గీతం 'మైనే పాయల్ హై ఛన్‌కాయ్' ఆలపిస్తుండగా స్టేడియం మొత్తం ఒక్కసారిగా ఉత్సాహంతో ఊగిపోయింది. వేలాది మంది అభిమానులు తమ ఫోన్ లైట్లు ఆన్ చేసి, త్రివర్ణ పతాకాలు ఊపుతూ ఆమెతో గొంతు కలిపారు. ఆ తర్వాత పంజాబీ పాప్ సింగర్ సుఖ్ బీర్ తనదైన శైలిలో పంజాబీ పాటలతో అభిమానుల్లో జోష్ నింపారు. ఈ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అంతర్జాతీయ పాప్ స్టార్ రికీ మార్టిన్ ప్రదర్శన అభిమానులకు ప్రత్యేక అనుభూతినిచ్చింది. ఆయన పాటలకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు.

## ప్రేయసితో నిశ్చితార్థం.. 'నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్' అంటున్న భారత క్రికెటర్..!



**న్యూఢిల్లీ:** భారత జట్టుకు దూరమైనా.. దేశవాళీలో మెరుస్తున్న పృథ్వీ షా త్వరలోనే ఇంటివాడు కాబోతున్నాడు. కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్‌తో ప్రేమలో మునిగి తేలుతున్న ఈ డాషింగ్ బ్యాటర్ నిశ్చితార్థం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఆదివారం వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ వైభవంగా జరిగింది. సినిమా నటి అయిన ఆకృతికి ఉంగురం తొడిగిన ఫొటలోను ఈ డాషింగ్ బ్యాటర్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. నా పర్ఫెక్ట్ ఇన్నింగ్స్ అనే క్యాప్షన్ జోడించాడు షా.

ఇటీవల కాలంలో ఆటకంటే వివాదాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచిన పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్ ఫొటోలతో మరోసారి నెట్టింట వైరలవుతున్నాడు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆకృతి అగర్వాల్‌తో పలు సందర్భాల్లో కెమెరా కంటపడిన షా.. ఎట్టకేలకు తమ బంధాన్ని బహిర్గతం చేశాడు. తాజాగా సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లితో జంటగా తళుక్కుమన్న ఆకృతి, పృథ్వీ షా ఆదివారం నిశ్చితార్థంతో పెళ్లికి వేళైందని సిగ్నల్ ఇచ్చారు.

లేత నీలం రంగు షేర్వానీలో షా మెరిసిపోగా.. ఎర్రని డిజైనర్ లెహెంగా ధరించిన ఆకృతి దేవకన్యలా వయ్యారాలు పోయింది. ఈమధ్యే త్రిముఖ సినిమాతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన ఆకృతిని ఇన్‌స్టాగ్రామ్‌లో 30 లక్షల మందికి పైగా అనుసరిస్తున్నారు.

జూనియర్ స్థాయిలో సంచలన ఆటతో మరో సచిన్ టెండూల్కర్‌గా ప్రశంసలందుకున్న పృథ్వీ షా.. ఊహించని విధంగా పాతాళానికి పడిపోయాడు. క్రమశిక్షణ కరువై, ఫిట్‌నెస్, ఫామ్ కోల్పోవడంతో అతడి కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్‌లోనూ నిరాశపరిచిన షా.. ఎట్టకేలకు దేశవాళీ సీజన్ 2025-26తో టచ్‌లోకి వచ్చాడు. ముంబై నుంచి మహారాష్ట్ర జట్టుకు మారిన అతడు.. పరుగుల వరదతో లయ అందుకున్నాడు. దాంతో.. ఐపీఎల్ 19వ సీజన్ మినీ వేలంలో షాను కనీస ధరకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది.

## ఆసీస్‌తో పింక్ బాల్ టెస్టు... టీమిండియా అమ్మాయిలకు ఘోర పరాజయం

**ఆసీస్ చేతిలో 10 వికెట్ల తేడాతో భారత్ ఓటమి**

**మల్టీ ఫార్మాట్ సిరీస్ గెలుచుకున్న ఆస్ట్రేలియా**

**రెండో ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలిన టీమిండియా**

**అరంగేట్రం టెస్టులో ఆకట్టుకున్న ప్రతీక రావల్**



**పెర్త్:** పెర్త్‌లోని వాకా (డబ్ల్యూఏసీఏ) మైదానం వేదికగా జరిగిన ఏకైక పింక్ బాల్ టెస్టులో భారత మహిళల జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆదివారం మూడో రోజు ఆటలో ఆస్ట్రేలియా జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో దిగ్గజ ప్లేయర్ అలిస్సా హీలీకి ఆస్ట్రేలియా ఘనంగా వీడ్కోలు పలికినట్లయింది. హీలీకి బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినప్పటికీ, ఆమె విజయంతో తన అంతర్జాతీయ కెరీర్‌ను ముగించింది. తాజా టెస్టు విజయంతో మల్టీ ఫార్మాట్ సిరీస్‌ను ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. భారత్ ఈ పర్యటనను టి20 సిరీస్ విజయంతో (2-1) ఘనంగా ఆరంభించినప్పటికీ, ఆ తర్వాత ఆసీస్ పుంజుకుంది. వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఆతిథ్య జట్టు, టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది.

మూడో రోజు 105/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి ఎక్కువ సేపు నిలవలేకపోయింది. అయితే అరంగేట్రం చేసిన ప్రతీక రావల్, స్నేహ రాణా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ప్రతీక 105 బంతుల్లో తన తొలి అర్ధశతకాన్ని పూర్తి చేసుకుంది. స్నేహ రాణా (30)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. అయితే గార్డనర్ బౌలింగ్‌లో స్నేహ రాణా ఔట్ కావడం, ఆ వెంటనే కాష్వీ గౌతమ్‌ను అలానా కింగ్ పెవిలియన్ చేర్చడంతో భారత్ కష్టాల్లో పడింది.

చివరికి భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ప్రతీక రావల్ 63 పరుగులతో ఒంటరి పోరాటం చేసింది. దీంతో ఆస్ట్రేలియా ముందు కేవలం 25 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యాన్ని ఆసీస్ ఓపెనర్లు జార్జియా వోల్ (16 నాటౌట్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (11 నాటౌట్) కేవలం 4.3 ఓవర్లలోనే ఛేదించి విజయాన్ని ఖరారు చేశారు.


అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 198 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా సదర్లాండ్ (129) భారీ సెంచరీతో 323 పరుగులు సాధించి 125 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ ఆధిక్యమే మ్యాచ్ ఫలితాన్ని శాసించింది. ఆసీస్ బౌలర్లలో లూసీ హామిల్టన్, గార్డనర్ రాణించారు.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: 198-149 (ప్రతీక రావల్ 63, స్నేహ రాణా 30; లూసీ హామిల్టన్ 3-32)

ఆస్ట్రేలియా: 323 -28/0 (జార్జియా వోల్ 16, లిచ్‌ఫీల్డ్ 11).

## నా ఇద్దరు కుమారులు మహిళలను గౌరవించేలా పెంచుతా : ఎన్టీఆర్



**టాకీస్:** టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం బెంగళూరు పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఒక ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి అతిథిగా విచ్చేసిన తారక్ ఈ వేడుక అనంతరం ఆసుపత్రి సిబ్బందితో కలిసి ముచ్చటించాడు. అయితే నేడు మహిళ దినోత్సవం సందర్భంగా ఒక లేడి డాక్టర్ తారక్‌ని అడుగుతూ.. ప్రస్తుతం ఉన్న సమాజంలో మహిళలను ఎలా గౌరవించాలో చెప్పండి అని అడుగగా.?

తారక్ మాట్లాడుతూ.. మహిళలను ఎలా గౌరవించాలో పదేపదే గుర్తుచేస్తూ ఉ ండటం నాకు నచ్చదు. పుట్టుకతోనే ప్రతి పురుషుడు మహిళల పట్ల గౌరవంతో పుట్టాల్సిన సమయం ఇది. మనం మన పిల్లలకు మన ఇళ్ల నుండే సరైన విద్యను అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. నా ఇద్దరు కుమారులు మహిళలను గౌరవిస్తూ పెరిగేలా నేను ఖచ్చితంగా చూసుకుంటాను అని ఎన్టీఆర్ వెల్లడించాడు. ఇక తారక్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత సమాజంలో మహిళల భద్రత మరియు గౌరవం గురించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన కుమారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని ఆయన చేసిన ప్రతిజ్ఞకు అభిమానుల నుంచి మరియు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## ‘ఉస్తాద్ భగత్ సింగ్’, ‘ధురంధర్ 2’ చిత్రాలతో లాంచ్ కాబోతున్న అల్లు సినిమాస్



**టాకీస్:** అల్లు అరవింద్ మరియు అల్లు అర్జున్‌ల ప్రతిష్టాత్మక మల్టీప్లెక్స్ ‘అల్లు సినిమాస్’ అత్యంత వైభవంగా ప్రారంభం కావడానికి సిద్ధమైంది. ఈ నూతన థియేటర్ల ప్రారంభోత్సవాన్ని చిరస్మరణీయం చేస్తూ, గ్లోబల్ స్థాయిలో అంచనాలు ఉన్న రణ్‌వీర్ సింగ్ భారీ యాక్షన్ చిత్రం ‘ధురంధర్ 2’ మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాస్ ఎంటర్టైనర్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రాలతో ప్రదర్శనలు మొదలుకాబోతున్నాయి. అత్యాధునిక లేజర్ ప్రొజెక్షన్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్ మరియు ఐమ్యాక్స్ స్థాయి విజువల్స్ వంటి ప్రపంచ స్థాయి సాంకేతికతతో రూపొందిన ఈ థియేటర్లు, ప్రేక్షకులకు సరికొత్త సినిమా అనుభూతిని పంచబోతున్నాయి. మార్చి 19న ఉగాది కానుకగా విడుదలవుతున్న ఈ రెండు భారీ చిత్రాల కోసం అల్లు సినిమాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా పవర్ స్టార్ అభిమానుల కోసం ప్రత్యేక డిజిటల్ డిస్ప్లేలు, లగ్జరీ సీటింగ్ మరియు ప్రీమియం ఫుడ్ కోర్ట్‌లతో ఈ సినిమాస్ ముస్తాబయ్యాయి. కేవలం వినోదం మాత్రమే కాకుండా, నైతిక విలువలతో కూడిన ఒక గొప్ప సామాజిక అనుభవాన్ని ప్రేక్షకులకు అందించడమే లక్ష్యంగా అల్లు ఫ్యామిలీ ఈ థియేటర్లను అందుబాటులోకి తెస్తోంది. ఈ డబుల్ ధమాకా మూవీ రిలీజ్‌లతో ‘అల్లు సినిమాస్’ టాలీవుడ్‌లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతోంది.

## ఓటీటీలోకి విశ్వక్ సేన్ ‘ఫంకీ’..



**టాకీస్:** మాస్ కా దాస్ విశ్వక్ సేన్, ‘జాతి రత్నాలు’ ఫేమ్ దర్శకుడు అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘ఫంకీ’ ఇప్పుడు డిజిటల్ సందడికి సిద్ధమైంది. వాలెంటైన్స్ సందర్భంగా ఫిబ్రవరి 13న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద తనదైన కామెడీతో ప్రేక్షకులను నవ్వించింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్‌ను ఖరారు చేసుకుంది. ప్ర ముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కు లను భారీ ధరకు దక్కించుకోగా, ఈ నెల మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి రానుం ది. ఒక యువ దర్శకుడు తన సినిమాను పూర్తి చేసే క్రమంలో ఎదుర్కొనే వింతైన పరిస్థితులు, బడ్జెట్ తలపోట్లు మరియు అను దీప్ మార్క్ ‘సిల్లీ హ్యూమర్’ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో నరేశ్, వీటీవీ గణేశ్ తమ కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. థియేటర్లలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, అనుదీప్ కేవీ స్టైల్ కామెడీని ఇష్టపడే ఓటీటీ ప్రేక్షకులకు ‘ఫంకీ’ ఒక క్రేజీ ఛాయిస్ కానుంది.



## సినిమాలు మానేసి వ్యవసాయం చేసుకుంటా..

స్టార్ హీరోయిన్ షాకింగ్ కామెంట్స్

టాకీస్: సినిమా ఇండస్ట్రీ అనేది ఓ రంగుల ప్రపంచం. ఈ ప్రపంచంలో రాణించాలని ఎంతో మంది ఎంట్రీ ఇస్తుంటారు. అయితే అందరూ సక్సెస్ అవ్వలేరు. కొందరు సక్సెస్ అయినప్పటికీ దాన్ని కంటిన్యూ చేయలేరు. కొన్ని సినిమాలకే పరిమితం అవుతుంటారు. మరికొంతమంది ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారి సినిమాలు చేస్తుంటారు. ఏళ్ల తరబడి ఇండస్ట్రీలో రాణిస్తున్న హీరోలు చాలా తక్కువ మందే ఉన్నారు. ఇక సినిమా అవకాశాలు తగ్గితే కొంతమంది హీరోయిన్స్ పెళ్లి చేసుకొని సెటిల్ అవుతారు. మరికొంతమంది బిజినెస్ లల్లోకి ఎంట్రీ ఇస్తుంటారు. అయితే ఓ హీరోయిన్ సినిమాల్లో క్రేజ్ వచ్చింది కాబట్టే కంటిన్యూ చేస్తున్నా లేదంటే వెళ్లి వ్యవసాయం చేసుకునే దాన్ని అని చెప్పి షాక్ ఇచ్చింది. ఇంతకూ ఆ ముద్దుగుమ్మ ఎవరో తెలుసా.?
బాలీవుడ్ లో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో వారిలో యామీ గౌతమ్ ఒకరు. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందుతోన్న యామీ గౌతమ్ తెలుగులోనూ చాలా సినిమాలు చేసింది. నువ్విలా, కొరియర్ బాయ్ కల్యాణ్, గౌరవం, యుద్ధం సినిమాల్లో కథానాయికగా చేసింది. అయితే 2015లో రిలీజైన కొరియర్ బాయ్ కల్యాణ్ తర్వాత కేవలం బాలీవుడ్ కే పరిమితమైందీ అందాల తార. దర్శకుడు ఆదిత్య ధర్ ను పెళ్లి చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఆదిత్య ధర్ ఇటీవల దురంధర్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్నాడు. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో యామీ గౌతమ్ షాకింగ్ కామెంట్స్ చేసింది. తనకు అవార్డులు , సక్సెస్‌లకంటే ప్రేక్షకుల ప్రేమే ముఖ్యం అని తెలిపింది. అలాగే కొన్ని సినిమాలు తన స్థాయిని పెంచాయని అందుకే సినిమాల్లో కంటిన్యూ అవుతున్నా అని తెలిపింది.. ఒకానొక సమయంలో సినిమా అవకాశాలు తగ్గిపోవడంతో హిమాలయాలకు వెళ్లి వ్యవసాయం చేసుకుందాం అనుకున్నా అని చెప్పుకొచ్చింది. అయితే బాలా సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో వరుసగా అవకాశాలు వచ్చినట్లు ఆమె తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

## ఆ ఒక్క తప్పు వల్లనే ఎన్నో ఛాన్స్‌లు మిస్ అయ్యాను..


లయ ఆసక్తికర కామెంట్స్



**టాకీస్:** తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు కుటుంబ కథానాయికగా ప్రత్యేక గుర్తింపు పొందిన నటి లయ తన సహజమైన నటనతో ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా 1990 నుంచి 2000 మధ్యకాలంలో ఆమె వరుస విజయాలతో టాలీవుడ్‌లో ప్రముఖ హీరోయిన్‌గా వెలుగొందింది. కూచిపూడి నర్తకిగా, జాతీయ స్థాయి చదరంగం క్రీడాకారిణిగా కూడా గుర్తింపు పొందిన లయ, సాంప్రదాయబద్ధమైన పాత్రల్లో నటిస్తూ కుటుంబ ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించింది. బాలనటిగా ‘భద్రం కొడుకో’ సినిమాతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన లయ, తరువాత కథానాయికగా ‘స్వయంవరం’ చిత్రంతో మంచి గుర్తింపు పొందింది. ఆ తర్వాత ‘ప్రేమించు’, ‘మనసున్న మారాజు’, ‘హనుమాన్ జంక్షన్’, ‘శివరామరాజు’, ‘అదిరిందయ్యా చంద్రం’ వంటి సినిమాల్లో నటించి మంచి విజయాలను అందుకుంది. ఈ చిత్రాలతో ఆమెకు కుటుంబ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. అయితే పెళ్లి తర్వాత లయ సినిమాలకు దూరమై అమెరికాలో స్థిరపడింది. అక్కడ కుటుంబ బాధ్యతలతో పాటు ఇతర కార్యక్రమాల్లో బిజీగా గడిపిన ఆమె కొన్నేళ్ల విరామం తర్వాత మళ్లీ నటనలోకి అడుగుపెట్టింది. ఇటీవల ‘తమ్ముడు’ సినిమాతో రీఎంట్రీ ఇచ్చిన లయ తాజాగా ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’ అనే ఫ్యామిలీ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంలో నటుడు శివాజీతో కలిసి ఆమె కీలక పాత్రలో కనిపించారు. ఈ సినిమా థియేటర్లలో మంచి స్పందన పొందుతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్లింగ్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సినిమా ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో లయ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

తన కూతురు శ్లోకాకు కూడా నటనపై ఆసక్తి ఉందని లయ తెలిపారు. గతంలో ఒక సినిమాలో చిన్నపాటి పాత్రలో నటించిన శ్లోకా భవిష్యత్తులో సినిమాల్లో రాణించాలని కోరుకుంటోందని చెప్పారు. సరైన అవకాశం వస్తే ఆమెను కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ‘సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని’ సినిమాలో ఉన్న ఒక పాట గురించి మాట్లాడుతూ లయ ఒక సరదా సంఘటనను గుర్తుచేశారు. అందులో వచ్చే ‘పాయ’ అనే పదం తనకు మొదట తెలియదని, తర్వాత అది ఒక నాన్‌వెజ్ వంటకం అని తెలిసి ఆశ్చర్యపోయానని నవ్వుతూ చెప్పారు. షూటింగ్ సమయంలో ఇలాంటి అనుభవాలు చాలా సరదాగా అనిపించాయని పేర్కొన్నారు.

## గ్లామర్ డోస్ పెంచేసిన కుర్ర భామ..



**టాకీస్:** వైష్ణవి చైతన్య.. సోషల్ మీడియా ద్వారా ఈ ముద్దుగుమ్మ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. షార్ట్ ఫిలిమ్స్, ఇన్ స్టా రీల్స్ ద్వారా బాగా పాపులర్ అయ్యింది ఈ అమ్మడు ఆ తర్వాత పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేసింది. యూట్యూబ్ లో ఈ అమ్మడికి మంచి క్రేజ్ ఉంది. ముఖ్యంగా షణ్ముక్ జస్వంత్ తో కలిసి ఆమె చేసిన సాఫ్ట్ వేర్ డెవలపర్ సిరీస్ ఏ స్థాయిలో విజయం సాధించిందో చెప్పక్కర్లేదు. ఆ తర్వాత నెమ్మదిగా సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. షార్ట్ ఫిల్మ్స్, సినిమాలు, ఇన్ స్టా రీల్స్ ద్వారా భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేసింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది, బేబీ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా ఊహించని విజయాన్ని అందుకుంది. బేబీ తర్వాత లవ్ మీ, జాక్ వంటి చిత్రాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం చేతిలో మరిన్ని చిత్రాలతో బిజీగా ఉంది. పదిహేనేళ్ల వయసులోనే నటిగా అవకాశాల కోసం ప్రయత్నాలు స్టార్ట్ చేసింది వైష్ణవి. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమా చేస్తుంది ఈ అమ్మడు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటిస్తుంది. సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ మెప్పిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోల్లో గ్లామరస్ లుక్ లో కనిపించి కవ్వించింది వైష్ణవి. గ్లామర్ డోస్ పెంచేసిందంటూ కామెంట్స్ చేస్తున్నారు అభిమానులు.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, Phone number: 9494451230, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341